1
నవతెలంగాణ
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
బుధవారం 22 మార్చి 2023

పేదల నోటికాడి ముద్ద
వందరోజుల పనికి బొంద

- ఉపాధి హామీ పథకానికి ఎసరు
- బడ్జెట్‌లో రూ.వేల కోట్ల నిధుల కోత
- జాతీయ ఉపాధి హామీ పథకానికి తూట్లు
- పేదల ఆకలి తీర్చని బీజేపీ సర్కార్
- పేదలపై భారాలు.. సంపన్నులకు వరాలు



పేదల నోటికాడి ముద్ద లాక్కున్న కేంద్ర ప్రభుత్వం.. వంద రోజుల గ్యారంటీ పనికి బొంద పెట్టేలా జాతీయ ఉపాధి హామీ పథకానికి రూ.వేల కోట్ల నిధుల్ని కోత పెట్టింది. గ్రామీణ పేదలకు వరంలా ఉన్న ఎన్‌ఆర్‌ఈజీఎస్‌కు తూట్లు పొడిచేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తుంది. ఉపాధి పథకానికి నిధులివ్వకుండా ఆపిన కేంద్రం ఈ బడ్జెట్‌లో ఏకంగా నిధుల కేటాయింపుల్ని తగ్గించేసేంది. పేదలపై భారాలు మోపుతూ సంపన్నులకు వరాల జల్లు కురిపిస్తున్న మోడీ పాలనలో అచ్చేదిన్ కాకుండా సచ్చే దిన్ వచ్చింది. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో 90 శాతం ప్రజలు ఇబ్బందులు పడుతుండగా 10 శాతం ఉన్న సంపన్నులు మాత్రం సంతోషంగా ఉన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాల్ని ఎండగడుతూ సీపీఐ(ఎం) చేపట్టిన జన చైతన్య యాత్ర సందర్భంగా జాతీయ ఉపాధి హామీ పథకంపై కథనం..!

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనేక పోరాటాల ఫలితంగా సాధించబడింది. ముఖ్యంగా పార్లమెంట్‌లో వామపక్షాల ఎంపీలు, బయట సీపీఐ(ఎం) ప్రజా పోరాటాల ద్వారా యూపీఏ ప్రభుత్వం 2005లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) తీసుకొచ్చింది. గ్రామీణ పేదరిక నిర్మూలనలో భాగంగా ఈజీఎస్ పథకం ద్వారా ప్రతి పేద కుటుంబానికి జాబ్‌కార్డు జారీ చేశారు. కనీసం ఏడాదికి వంద రోజుల గ్యారంటీ పని కల్పించే విధంగా చట్టాన్ని అమలు చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన ఈ ఎనిమిది ఏళ్ల కాలంలో ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ వస్తున్నారు. పెరుగుతున్న ధరలు, అవసరాలకు అనుగుణంగా పని దినాలు పెంపు, వేతనాల పెంపు, బడ్జెట్ పెంపు విషయాల్ని ఉన్నప్పటికీ మోడీ ప్రభుత్వం పేదల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తూ వస్తుంది. పైగా ఏటేటా బడ్జెట్‌లో నిధుల కోత పెడుతూ పేదలకు పని దొరకకుండా చేస్తుంది.

25.54 లక్షల పేదలపై కక్షపూరిత వైఖరి

మోడీ ప్రభుత్వం ఉమ్మడి మెదక్ జిల్లాలోని 25.54 లక్షల పేదల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తుంది. 2023 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి రూ.2900 కోట్ల నిధుల్ని కోత పెట్టింది. కేంద్రం బడ్జెట్‌లో నిధులు తగ్గించడం వల్ల ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డులున్న గ్రామీణ పేదలకు పని లేకుండా పోనుంది. చట్టం ప్రకారం ప్రతి జాబ్‌కార్డు దారుడు కోరితే 100 రోజులు పని కల్పించా లి. ఇప్పటికి బడ్జెట్ సకాలంలో రావట్లేదనే నెపంతో 20 శాతం మందికి కూడా వంద రోజుల పని చూపట్లేదు. ఈ బడ్జెట్‌లో భారీగా నిధులు తగ్గినందున ఆ మేరకు కూడా వంద రోజుల పని దొరికే పరిస్థితి ఉండదు. సంగారెడ్డి జిల్లాలో 2.78 లక్షల జాబ్‌కార్డులున్నాయి. 2022-23 సంవత్సరంలో జిల్లాలో 90 వేల కుటుంబాల్లోని 1 లక్షా 50 వేల మందికి 39 లక్షలా 35 వేల పని దినాలు కల్పించారు. వేతనాలు, మెటీరియల్ రూపంలో జిల్లాలో రూ.84.84 కోట్ల నిధుల్ని ఖర్చు చేశారు. మెదక్ జిల్లాలో 2.50 లక్షల జాబ్‌కార్డులున్నాయి. వీరిలో 2022-23లో 33 లక్షలా 86 వేలా 279 పని దినాలు కల్పించారు. సిద్దిపేట జిల్లాలో 2.60 లక్షల జాబ్‌కార్డులున్నాయి. ఇక్కడ కూడా 35.23 లక్షల పని దినాలు కల్పించారు. మూడు జిల్లాలో కలిపి ఏటా 250 కోట్ల మేరకు పేదలకు పని కల్పించి వేతనాలు, మేటీరియల్ కోసం ఖర్చు చేస్తున్నారు. మోడీ ప్రభుత్వం నిధుల్ని భారీగా తగ్గించడం వల్ల సగటు పని దినాలు భారీగా తగ్గిపోనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు లభించడంతో పేదలు, వృద్ధులు, మహిళలు, యువకులు గ్రామాల్లోనే కుటుంబాల్ని పోషించుకుంటు న్నారు. పథకాన్ని నీరుగార్చడం వల్ల పల్లె జనాలు పనుల కోసం పట్టణాలకు వలసెల్లి బతికే దుస్థితికి మోడీ ప్రభుత్వం నెడుతోంది.

ఉపాధి నిధుల కోతతో కుంటుపడుతున్న గ్రామీణాభివృద్ధి

ఉపాధి హామీ పథకానికి కేంద్రం నిధులు తగ్గించడం వల్ల గ్రామీణాభివృద్ధి కుంటు పడనుంది. ఈజీఎస్ నిధులతో కూలీలకు పని కల్పించడమే కాకుండా హరితహారం కింద మొక్కలు నాటడం, పెంచడం జరుగుతుంది. వైకుంఠదామాలు, రైతు వేదికలు, నీటి తొట్లు, రైతు కళాలు నిర్మిస్తున్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు వేస్తున్నారు. వ్యవసాయ పొలాలకు లింకు రోడ్లు వేస్తున్నారు. క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, చెత్త డంపింగ్ యార్డుల వంటి అభివృద్ధి కూడా ఉపాధి నిధులతోనే జరుగుతున్నాయి. కేంద్రం నిధుల్ని భారీగా తగ్గించడం వల్ల మెదక్ 469, సిద్దిపేటలో 499, సంగారెడ్డిలో 647 గ్రామ పంచాయతీలున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 1615 పంచాయతీల్లో జరిగే పలు అభివృద్ధి పనులకు నిధుల్లేకుండా చేసి అభివృద్ధిని అడ్డుకునే కుట్ర మోడీ ప్రభుత్వం చేస్తుంది.

పేదల వ్యతిరేకి మోడీ, బీజేపీ



పేదలంటే మోడీకి, బీజేపీ గిట్టదు. గ్రామీణ పేదరికాన్ని నిర్మూలించేందుకు దోహదపడుతున్న ఉపాధి పథకాన్ని రద్దు చేయాలని మోడీ, బీజేపీ మంత్రులు ఆలోచిస్తున్నారు. ఉపాధి పథకం వల్ల గ్రామీణ పేదలకు పని దొరుకుతుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లోని పేదలకు ఈ పథకం వరంలా ఉండేది. దీన్ని దెబ్బతీయాలని బీజేపీ చూస్తుంది. ఈ బడ్జెట్‌లో రూ.2400 కోట్ల మేరకు నిధుల్ని తగ్గించింది. మోడీ విధానాలకు వ్యతిరేకంగా పేదలు పోరాడాలి. బీజేపీ పేద లకు పని లేకుండా చేయడమే కాకుండా మతం పేరిట చిచ్చు రగిల్చి లబ్ధిపొందాలని చూస్తుంది. మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు వరాలు గుప్పిస్తూ పేదలపై భారాలు మోపుతుంది.

- నర్సింహులు, వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు

పని దొరక్కపోతే బతికేదెట్ల



పని దొరికితేనే బతికేది కష్టం. ఇక ఉపాధి పని తీసేస్తే మా బోటి పేదలు బతికేదెట్ల. బీజేపోళ్లకు పేదలంటే ఇష్టంలేనట్లుంది. పని చేసినా పైసలిస్తలేరు. రోజంత పనిచేస్తే రూ.249 ఇయమని ఉంది. ఏనాడు నూటయాభైకి మించి ఇవ్వలేదు. గిప్పుడు బడ్జెట్ తీసేసింద్రంట. ఇక వంద కూడా ఇయ్యనట్లున్నరు. మోడీ పైసలిస్తలేరని కూలీ డబ్బులేస్తలేరు. ఉపాధి పనులు బంద్ చేస్తే పేదోళ్లకు పస్తులే. పైసలు పెంచి పని దినాలు కల్పించాలి.

- నర్సింహ, వ్యవసాయ కూలీ

శ్రీశోభకృత్ నామ సంవత్సర శుభాకాంక్షలు



నవ తెలంగాణ-సిద్దిపేట

తెలుగు నూతన సంవత్సరాది శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా మంత్రి హరీశ్‌రావు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు నూతన సంవత్సరాన్ని ఆనందోత్సాహాలతో, సుఖసంతోషాల మధ్య అన్ని వర్గాల ప్రజలు జరుపుకోవాలన్నారు. ఉగాది పచ్చడిలాగే మీ జీవితం షడ్రుచుల సంగమంగా మారాలన్నారు. తెలుగు వారి సంప్రదాయాలకు ప్రతిరూపమైన ఉగాది సందర్భంగా శ్రీ శోభకృత్ నా అంత శోభయమానంగ విరిజిల్లాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని, ఈ సంవత్సరం అన్నిరంగాల్లో పురోభివృద్ధిని సాదించాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందడం సంతృప్తినిచ్చిందని, ఈ ఏడు కాలంతో ప్రమేయం లేకుండా కాళేశ్వరం జలాలతో కాలువలు, చెరువులు, కుంటల్లో నీళ్ల సమృద్ధిగా నిండి ఉన్నాయని చెప్పారు. మండు టెండల్లో చెక్ డ్యామ్ లు..వాగులు జల సిరులు చుస్తున్నామన్నారు. రైతులు ఆనందంతో పాడి పంటలతో వర్ధిల్లాలన్నారు. ఈ శోభకృత్ సంవత్సరంలో అన్ని పాలద్రోలి అన్నింటా శుభం జరగాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. ఈ కొత్త సంవత్సర పర్వదినం అందరి కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపాలన్నారు.

జన చైతన్య యాత్రకు సంపూర్ణ మద్దతు



నవతెలంగాణ-పటాన్‌చెరు

భారతీయ జనతా పార్టీ మతోన్మాద కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో తలపెట్టిన జన చైతన్య యాత్ర కు సంపూర్ణ మద్దతు అందిస్తామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం సీపీఎం నాయకులు ఎమ్మెల్యేను కలిసి జన చైతన్య యాత్రకు హాజరుకావాలని కోరుతూ ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటలకు సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో చైతన్య యాత్ర ముగింపు సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సిపిఎం నాయకులు రాజయ్య. పాండురంగారెడ్డి. నరసింహారెడ్డి పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటిన ఎంపీటీసీ



నవతెలంగాణ దుబ్బాక రూరల్

దుబ్బాక మండలం చీకోడ్ గ్రామానికి చెందిన అమృతోజీ శ్రీనివాస్ చారి ఇటీవల గుండె పోటుతో మృతి చెందారు. శ్రీనివాస్ తండ్రి లక్ష్మణ్ కూడా ఇటీవల మరణించారు. శ్రీనివాస్ మరణంతో ఆ కుటుంబం రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. శ్రీనివాస్‌కు భార్య లావణ్య, ఇద్దరు కూతుళ్ల భార్గవి, మానస చిన్న పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎంపిటిసి ఎల్ రాం రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఇద్దరు కూతుళ్ల పేరున రూ.ఐదు వేల చొప్పున రూ. పదివేల రూపాయలు బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేసి బాండ్ పేపర్లను అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ప్రముఖ సింగర్, పాటల రచయిత కమ్మరి నర్సింహులు, గ్రామ పెద్దలు కొంగరి ఎల్లారెడ్డి, అమృతోజి సుదర్శన్, ఇనుప రాజనర్స్, కాసారం రమేశ్, పోగుల దామోదర్, మంద లక్ష్మా రెడ్డి, కొంగరి భూపాల్ రెడ్డి, దాకురి రాజిరెడ్డి తదితులున్నారు.

రైతుబీమా నామినీ వివరాల సేకరణ

దుబ్బాక మండల పరిధిలోని పర్శరాంనగర్ గ్రామానికి చెందిన పర్శ మల్లయ్య రైతు ఇటీవల మృతి చెందారు. ఈ విషయాన్ని చికోడ్ ఎంపీటీసీ లచ్చుమ్మగారి రాం రెడ్డి వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా మంగళవారం ఏఈవో అధికారి హరీష్ నామినీ వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు సమర్పించారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



నవతెలంగాణ జగదేవపూర్

నిన్న మొన్న కురిసిన వడగండ్ల వానకు పంట నష్టం జరిగిన రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని టీపీసీసీ డెలికేట్ సభ్యుడు జశ్వంత్ రెడ్డి, కాంగ్రెస్ కిసాన్ సేల్ జిల్లా అధ్యక్షుడు కొన్యాల బాలకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో అకాల వర్షాలకు నష్టం జరిగిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలతో ఆయా గ్రామాల్లో వేల సంఖ్యలో పంట నష్టం జరిగిందని చెప్పారు. పంట నష్టం జరిగిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో వరి, మొక్కజొన్న, మామిడి, కూరగాయల పంటలు వడగండ్లకు నష్టం జరిగిందన్నారు. అధికారులు పంట నష్టాన్ని అంచన వేసి వెంటనే నష్టపరిహారం అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పంట నష్టం జరిగిన రైతులకు ఎకరానికి 20వేల పంట నష్టం అందించాలని చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్, నాయకులు నాగరాజు, అక్బర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

- 12 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మూడు కార్లు, రెండు ద్విచక్రవాహనలు స్వాధీనం

నవతెలంగాణ-కొమురవెల్లి

మండలంలోని గౌరయపల్లిలో తిరుపతిరెడ్డికి చెందిన మామిడి తోటలో గుట్టు చప్పుడు కాకుండ గత మూడు రోజులుగా పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం పేకాట స్థావరంపై దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఎస్‌ఐ చంద్రమోహన్‌యాదవ్‌కు నిందితులను అప్పగించారు. ఈ దాడిలో 12 మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేశారు. వారి వద్దనుంచి రూ.1,01,900 నగదు, 3 కార్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బాధిత కుటుంబానికి మజీద్ కమిటీ చేయూత



నవ తెలంగాణ రాయపోల్

విద్యుత్ షాక్ తో పూరి గుడిసె దగ్ధమైన కుటుంబానికి నియోజవర్గం మజీద్ కమిటీ చేయూతనివ్వడం జరిగిందని దుబ్బాక నియోజకవర్గం మజీద్ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ మౌలానోద్దిన్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండల పరిధిలోని సయ్యద్ నగర్ గ్రామంలో ఇటీవల విద్యుత్ షాక్ తోటి పూరిగుడిసి దగ్ధమైన కుటుంబాన్ని పరామర్శించి బియ్యం నిత్యవసర సరుకులు ఆర్థిక సహాయం అందజేశారు. సయ్యద్ నగర్ గ్రామంలో నిరుపేద ముస్లిం కుటుంబానికి చెందిన నాజియా పఠాన్ గౌస్ దంపతుల పూరి గుడిసె విద్యుత్తు షాక్ వల్ల దగ్ధం కావడం చాలా బాధాకరమని, వారి కుటుంబానికి దుబ్బాక నియోజకవర్గ మజీద్ కమిటీ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం, ఇంటికి కావలసిన నిత్యావసరాల సరుకులు దాదాపు రూ.10 వేల వస్తువులు, 2 వేల ఆర్థిక సహాయం అందించడం జరిగింది. నియోజకవర్గ మజీద్ కమిటీ చీఫ్ అడ్వైజర్, ఎండి జహంగీర్, ప్రధాన కార్యదర్శి ఎండి అల్తాఫ్, గౌరవ అధ్యక్షులు ఎండి జాకీర్, ఎండి అఫ్జల్, షేక్ అంజద్, ఎండి సయ్యద్, ఎండి ఇమామ్, ఎండి సోహెల్, అల్వాల్ జహంగీర్, బాబు, గ్రామ మజీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



నవ తెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ మండలంలోని ప్రజ్ఞాపూర్ గ్రామంలో ఆయిల్‌పామ్ పంటను సాగుచేసిన రైతుల వ్యవసాయ క్షేత్రాలను మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆయిల్ ఫామ్ పంటలను సాగు చేసేందుకు ముందుకు రావాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు కూడా ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలని, ఆయిల్ ఫామ్ వంట సాగుకు ప్రభుత్వ రంగం అందిస్తున్న రాయితీలను వినియోగించుకోవాలని, పంటను మూడేళ్లు సాగితే 30 ఏళ్ల వరకు బ్రతికిస్తుందన్నారు. ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వమే రైతు పండించిన ఆయిల్ ఫామ్ గెలలను కొంటుందని, జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగరాజు, విస్తరణ అధికారి గణేష్ కుమార్ రైతులు రొట్టెల శ్రీనివాస్, నంద్యాల రవీంద్ర వర్మ ,మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



నవ తెలంగాణ మిరు దొడ్డి

ఔషధాల విధానం భారత దేశంలో దశాబ్దాలుగా పాటిస్తున్న సంప్రదాయ ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయుష్ వైద్యాధికారి ఉమ, ఎంపీపీ సాయిలు అన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సంప్రదాయ వైద్య విధానాలపై ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయుష్ వైద్య విధానం మెదడువాపు వ్యాధిని నియంత్రించి, నయం చేయడంలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకోవడం జరిగిందన్నారు. విద్యార్థులకు అందించే ఆయుష్ కిట్లు ఆకలిని పెంచడంతోపాటు శారీరక పెరుగుదల, మానసిక ఒత్తిడిని తగ్గిస్తుందన్నారు. అదేవిధంగా చికెన్ గున్యా ,డెంగ్యూ, అత్యంత ప్రమాదకరమైన కరోనా లాంటి వ్యాధులను సకాలంలో నివారించే శక్తి ఈ మందులకు ఉందని తెలిపారు. ఎంపీపీ ఉపాధ్యక్షులు పోలీస్ రాజులు, సర్పంచ్ రాములు, ఎంపీటీసీ నరసింహులు, మండల విద్యాధికారి ప్రభుదాస్ ,పాఠశాల ప్రత్యేక అధికారి స్వర్ణలత పాల్గొన్నారు.

దళితబంధు నియోజకవర్గ కమిటీ ఏర్పాటు



నవతెలంగాణ-తొగుట

దళితబంధు నియోజకవర్గ కమిటీ ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు లింగాల కృష్ణ, చందా రాజులు తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గ దళిత బంధు సమన్వయ కమిటీ అధ్యక్షుడిగా కరికె శ్రీని వాస్,వైస్ చైర్మన్ గా గుర్రాల శ్రీనివాస్,ర్యాకం శ్రీరా ములు, కాల్వ నరేష్,కమిటీ సభ్యులుగా మున్సి పల్ పరిధి నుండి ఆస స్వామి,ఇల్లందుల శ్రీనివా స్, ఉషంగాల్ల శ్రీనివాస్, పుట్ల రాజు,సబంగ యాద గిరి,బండారు దేవేందర్,తొగుట మండలానికి చెంది న లింగాల కిష్ట,చంద రాజు,మిరుదొడ్డి నుండి దారా స్వామి,ఎర్ర యాదగిరి, నర్సింగ్ మండలం నుండి చిగురు గళ్ళ ప్రభాకర్,కందరి నవీన్, భూంపల్లి మండలం నుండి కుమార్,సుమన్,నందు తదితరులతో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు.

ధనవంతులకు రాయితీలు పేదలపై భారాలు



- ఇదే మోడీ సర్కారు వైఖరి
- కార్మిక, కష్టజీవుల డిమాండ్ల సాధన కోసం ఏప్రిల్ 5న చలో ఢిల్లీ
- కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు,ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం
- సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.భాస్కర్

నవతెలంగాణ-దుబ్బాక

ధనవంతులకు రాయితీలు పేదలపై భారాలు మోపడమే మోడీ సర్కారు వైఖరి అని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దామని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.భాస్కర్ పిలుపునిచ్చారు. కార్మిక, కష్టజీవుల డిమాండ్ల సాధనకై ఏప్రిల్ 5న సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. చలో ఢిల్లీని జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలో సీఐటీయూ, వ్యాకాస, రైతు సంఘాల ఆధ్వర్యంలో మండల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జి.భాస్కర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 8 ఏళ్లుగా దేశంలో అమలు చేస్తున్న కార్పొరేట్, మతోన్మాద అనుకూల విధానాలను రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను తక్షణమే విరమించుకోవాలన్నారు. కార్మిక హక్కులు, కార్మిక చట్టాల రక్షణ ,4 లేబర్ కోడ్ల రద్దు, విద్యుత్ సవరణ బిల్లు 2022 ఉపసంహరించాలని డిమండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ పెంచాలన్నారు. పని దినాలు 200 రోజులకు పెంచి రోజుకు రూ.600 కూలీ నిర్ణయించాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు రాయితీలు కల్పిస్తూ కార్మికులకు, రైతులకు వ్యతిరేకంగా పని చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.చంద్రారెడ్డి, సీఐటీయూ దుబ్బాక టౌన్ కన్వీనర్ కొంపెల్లి, భాస్కర్, కార్మికులు వెంకటస్వామి, శ్రీనివాస్, నాగరాజు, రాములు, స్వామి, అనిల్, రాజిరెడ్డి, ఎల్లం, పోశయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మతోన్మాద విధానాలను వ్యతిరేకించాలి

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్



'బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా సంక్షేమం కోసం మతసామరస్యాన్ని కాపాడాలి. ప్రజాస్వామ్యం పరిరక్షించబడాలి. సామాజిక న్యాయం కోసం పెద్ద ఎత్తున పోరాటం చేయాలి. సీపీఎం ఆధ్వర్యంలో జరుగుతున్న జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలి' అని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 26, 27వ తేదీలలో జరుగుతున్న సీపీఎం జనచైతన్య యాత్రకు సంఘీభావంగా మంగళవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆముదాల మల్లారెడ్డి అధ్యక్షతన సిద్దిపేటలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టాపురం లక్ష్మణ్, ఆర్ఎస్పి ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మన్నె కుమార్, ఎం ఎస్ పి ఎమ్మార్పీఎస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పెరక పరుశురాం, పి డి ఎస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ వి శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్దన్, సిఐటియు జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్ళ బండి శశిధర్, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి,ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సింగిరెడ్డి నవీన, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండ కింది అరుణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సనాది భాస్కర్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బక్కిలి బాలకిషన్, ఆరెకటికే అభివృద్ధి సంఘం జిల్లా అధ్యక్షులు బాలకిషన్ మాట్లాడారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి... తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కులం మతం పేరా విద్వేషాలు రెచ్చగొడుతూ రాష్ట్ర విభజన సందర్భంలో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ఈ నెల 27న జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు.

ఇంటి పన్నులు తగ్గించాలని 24న పట్టణ బంద్

పట్టణ ప్రజలకు జేఏసీ,అఖిలపక్ష నాయకుల పిలుపు

నవతెలంగాణ చేర్యాల

చేర్యాల మున్సిపాలిటీ లో ఇంటి పన్నులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న జరిగే చేర్యాల పట్టణ బంద్ కు ప్రజలు, వ్యాపార వర్గాలు స్వచ్ఛందంగా బంద్ పాటించి నిరసన తెలపాలని జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ పిలుపునిచ్చారు.పట్టణ కేంద్రంలోని వాసవి గార్డెన్ లో మంగళవారం బంద్ కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ మాట్లాడుతూ పట్టణ వ్యాపార, ఇంటి పన్ను యజమానుల పరిస్థితులకు భిన్నంగా ఆర్థిక, భౌగోళిక పరిస్థితులను చూడకుండా మున్సిపల్ లో పన్నులు పెంచాలని నిర్ణయం తీసుకోవడం ప్రజలపై అధిక పన్నుల భారం మోపడమేనని విమర్శించారు. మేజర్ గ్రామపంచాయతీ గా ఉన్నప్పటి పరిస్థితులు మాత్రమే పట్టణంలో ఉన్నాయని, మున్సిపాలిటీ అయినప్పటికీ పట్టణ ప్రజల ఆర్థిక స్థితిగతులు ఏమాత్రం మారలేదన్నారు. పట్టణ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పాత పద్ధతిలోనే పన్నులు వసూలు చేయాలని, వ్యాపారస్తుల ట్రేడ్ లైసెన్స్ ఫీజులు పెంచకుండా పాత పద్ధతిలోనే లైసెన్సులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రజల పక్షాన జేఏసీ ఆధ్వర్యంలో అనేక ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ కౌన్సిలర్లు, అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం ప్రజలకు అన్యాయం చేయడమేనన్నారు. ఇప్పటికైనా తమ వైఖరి మార్చుకొని పాత పద్ధతిలోనే పన్నుల విధానాన్ని కొనసాగించే విదంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇంటి పన్నులు తగ్గించేంతవరకు జేఏసీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. పట్టణ బంద్ కు వ్యాపార, వాణిజ్య, వర్తక సంఘాలు స్వచ్ఛందంగా షాపులు బంద్ పాటించి నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జేఏసీ కో చైర్మన్ పుర్మ ఆగంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆది శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి అందె బీరయ్య, మాజీ జెడ్పిటిసి కొమ్ము నర్సింగరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు తడక లింగం, టిడిపి పట్టణ అధ్యక్షులు మిట్టపల్లి నారాయణరెడ్డి, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి బుట్టి సత్యనారాయణ, ఇంటి పన్ను బాధితుల సంఘం అధ్యక్షులు బద్దిపడగ నరసింహారెడ్డి, జేఏసీ నాయకులు ఈరి భూమయ్య, రాళ్లబండి నాగరాజు, బండకింది అరుణ్ కుమార్, గూడ రాజిరెడ్డి, బండారి సిద్దులు, ఎండి ఖాజా, పుట్ట రాజు, బోయిని మల్లేశం, కొంపెల్లి శ్రీనివాస్, బండి సుదర్శన్, వెలగల దుర్గయ్య, వెలుగల నాగరాజు, మంచాల నారాయణ,మల్లారెడ్డి, రాజు, పాల్గొన్నారు.



కుటుంబ పోషణ భారమై యువకుడి ఆత్మహత్య



నవ తెలంగాణ-దుబ్బాక

కొన్ని నెలలుగా ఏ పని దొరక్క కుటుంబ పోషణ భారమై ఆర్థిక ఇబ్బందులు తీవ్రమవడంతో వేదనకు గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుబ్బాక పురపాలిక కేంద్రంలోని 1వ వార్డు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయంలో మంగళవారం జరిగింది. దుబ్బాక ఎస్ఐ బత్తుల మహేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పురపాలిక పరిధిలోని ధర్మాజీపేట తొమ్మిదో వార్డుకు చెందిన కొట్టే కనకయ్య (31) తండ్రి మల్లయ్య గంగిరెద్దుల వృత్తితో భార్య, ముగ్గురు పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి దుబ్బాకలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమయంలో నివసిస్తున్నారు. కొన్ని నెలలుగా ఏ పని దొరక్కపోవడంతో కుటుంబాన్ని పోషించడం భారంగా మారి ఆర్థిక ఇబ్బందులు ఎక్కువవడంతో తీవ్ర మానసిక వేదన చెందాడు. జీవితంపై విరక్తి చెందిన కనకయ్య సోమవారం అర్ధరాత్రి అందరూ పడుకున్నాక గదిలోని ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం గుర్తించిన కుటుంబీకులు దుబ్బాక పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య దుర్గవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

డబుల్ బెడ్ రూమ్ దరఖాస్తుదారుల రాస్తారోకో





నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్‌లో మంగళవారం డబుల్ బెడ్ రూమ్ దరఖాస్తుదారులు రాస్తారోకో నిర్వహిస్తున్నారు. డ్రా పూర్తి అయిన వెంటనే డబుల్ బెడ్ రూమ్ రాని దరఖాస్తుదారులు ఆందోళనకు దిగారు. నర్సింలు అనే లబ్ధిదారు గత 20 సంవత్సరాలుగా తాను గజ్వేల్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నానని ఏడుస్తూ... పెట్రోల్ పోసుకునే ప్రయత్నం చేశారు. గమనించిన పోలీసులు పెట్రోల్ బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 200 మందికి పైగా దరఖాస్తుదారులు రాస్తారోకో చేశారు. 20 ఏళ్లగా అద్దె ఇంట్లో ఉంటున్నామని, నిజమైన లబ్ధిదారులను సర్వే అధికారులు గుర్తించలేకపోయారని కన్నీరు పెట్టారు. టీడీపీ, కాంగ్రెస్, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు. అధికారులు నాలుగు సార్లు సర్వేకు వచ్చారని ఆవేదన చెందారు. ప్రభుత్వం పేదలకు ఇల్లు ఇవ్వడం లేదన్నారు. ఉన్నవారికే ఇండ్లు దక్కినట్లు మహిళలు మండిపడ్డారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రాస్తారోకోను విరమింపజేశారు.

అర్హులకు డబుల్‌బెడ్‌రూవమ్ ఇండ్లు

అర్హత ఉన్నవారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయిస్తామని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. గజ్వేల్ పట్టణంలో మంగళవారం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లాటరీ విజయవంతంగా నిర్వహించామన్నారు. అర్హత ఉన్నవారికి అందుబాటులో ఉన్న ప్లాట్లను కేటాయిస్తామన్నారు. డబుల్ బెడ్ రూమ్ ప్లాట్లను పొందేందుకు అర్హత ఉన్న గజ్వేల్ పట్టణానికి చెందిన వారు గజ్వేల్ ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఇండస్ట్రియల్ పార్కులో ఓనర్లు మాత్రమే అర్హులు: కలెక్టర్

నవ తెలంగాణ కొండపాక

టీఎస్ఐఐసీ పార్కులో సిద్దిపేట ఆటోనగర్‌లో ఓనర్లు మాత్రమే అర్హులని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నార రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు రాష్ట్రంలోనే ఆదర్శంగా ఉండేలా 50 కోట్ల రూపాయల విలువైన 25 ఎకరాల స్థలంలో 15 కోట్ల రూపాయల వ్యయంతో సిద్దిపేట ఇండస్ట్రియల్ పార్క్ లో మోడల్ ఆటోనగర్ కు ఇదివరకే శంకుస్థాపన చేశారు. ఈ ఆటోనగర్ లో నిర్మాణం తుది దశకు చేరుకుంది కావున మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని కాన్ఫరెన్స్ హల్ లో ఆటో నగర్ యూనియన్ నాయకులతో జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో కలెక్టర్ మాట్లాడుతూ ఆటో నగర్ లో ఉన్న షాప్ ఓనర్లకు మాత్రమే అర్హులని తెలిపారు. %టూక్మీక్రీంజ% సంస్థ వారు పరిశ్రమలకు లీజ్ పద్ధతిలో అందజేస్తామని ట్రేడ్ లైసెన్స్, పోటో కాపితో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారిగా ప్రాధాన్యత పద్ధతిలో సర్టిఫికెట్లు జారి చేస్తామన్నారు. ఆటో నగర్ యూనియన్ నాయకులు త్వరగా దరఖాస్తు చేసుకుని యుద్ధ ప్రాతిపదికన అర్హులని గుర్తించి సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. ఎవైన సమస్యలు ఉంటే మంత్రి గారి సమక్షంలో చర్చించి పరిష్కరించుకోవాలి. కార్యక్రమంలో రాష్ట్ర మెడికల్ బోర్డు సభ్యులు పాల సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.





ఘనంగా డీఎస్పీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-జహీరాబాద్



ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించిన వారు ఎక్కడైనా గౌరవించబడతారని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. జహీరాబాద్ డీఎస్పీ వి.రఘు జన్మదినం సందర్భంగా స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం కేక్ కట్ చేసి శాలువా, బొకేతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి.. వారి సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కరించిన అధికారులు ఎక్కడైనా రాణించగలుగుతారని.. ప్రజల గుండెల్లో స్థానాన్ని సంపాదిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ స్వామీ, సిఐ భూపతి, ఎస్ఐలు వినయ్ కుమార్, పరమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ గదికి తాళం

నవతెలంగాణ-సదాశివపేట



పట్టణ పరిధిలోని శ్రీ చైతన్య పాఠశాలకు సంబంధించి.. గత మూడేండ్లుగా టాక్స్ బకాయి ఉన్నందున మంగళవారం పురపాలక సంఘం అధికారులు మేనేజర్ ఉమేందర్ సింగ్, ఆర్ఐ వెంకట్రావు వారి సిబ్బందితో కలిసి పాఠశాల ప్రిన్సిపాల్ గదికి తాళం వేసి సీల్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలో ఉన్న వ్యాపార వాణిజ్య మరియు ఇంటి టాక్స్‌ల కోసం కోసం ప్రచార నిమిత్తం టాక్స్‌లు వసూలు చేస్తున్నామన్నారు. మొండి బకాయిలు ఉన్న వారిపై ఇలాంటి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పట్టణ ప్రజలు, వ్యాపారులు తమ బకాయిలను సకాలంలో చెల్లించి పురపాల సంఘం అభివృద్ధికి తోడ్పడాలన్నారు.

కొత్త ఏడాదిలో అందరికి శుభమే కలగాలి

నవతెలంగాణ-పటాన్‌చెరు



కొత్త ఏడాదిలో అందరికీ శుభమే కలగాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కోరారు. పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలకు తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం (శ్రీ శోభకృత్ నామ సంవత్సరం) శుభాకాంక్షలు తెలిపారు. 'శోభకృత్' అంటే శుభాలను కలిగించేదని పేరుకు తగ్గట్టుగా కొత్త ఏడాదిలో అందరికీ శుభమే జరగాలని ఆకాంక్షించారు. ఉగాది పర్వదినాన్ని ఆనందంగాను, ఉత్సాహంగా జరుపుకోవాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతోను, అష్టైశ్వర్యాలతోను తులతూగాలని ఎమ్మెల్యే అభిలాషించారు.



కేసీఆర్‌తోనే మారుమూల గ్రామాలభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-గుమ్మడిదల

ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే మారు మూల గ్రామాల అభివృద్ధి సాధ్యమని పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో తీసుకువచ్చిన సంక్షేమ పథకాలను ప్రతీ గడపకు తీసుకెళ్లాలన్నారు. త్వరలోనే మండలాల వారీగా ఆత్మీయ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసుకుందామన్నారు. బీఆర్ఎస్ మండల నాయకులు, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలి



నవతెలంగాణ-సదాశివపేట

అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో తహసిల్దార్ మనో హర్ చక్రవర్తికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గత మూడు నాలుగు రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాల తో.. చేతికొచ్చిన మిరప, మొక్కజొన్న, ఉల్లి, మామిడి, వరి తదితర పంటలన్నీ విపరీతంగా దెబ్బతిన్నాయని వాపోయారు. అప్పులు తెచ్చి పెట్టుబడి పెడితే.. పంట మొత్తం నీటపాలై రైతులకు కన్నీరే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50,000 చొప్పున చెల్లించాలని కోరారు. బీకేఎంయు మండల కార్యదర్శి ఎం.రమేష్, సీపీఐ మండల కన్వీనర్ ముస్తఫా, నాయకులు మెహబూబ్ అలీ, ఖలీల్ తాస్లిం పాల్గొన్నారు.

ఘనంగా 'బొల్లారం పబ్లిక్ స్కూల్' వార్షికోత్సవం

నవతెలంగాణ-ఐడిఏబొల్లారం



బొల్లారం మున్సిపల్ పరిధిలోని 'బొల్లారం పబ్లిక్ స్కూల్' పాఠశాలలో సోమవారం సాయంత్రం నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో యువత నాయకుడు వి.ప్రవీణ్‌రెడ్డి అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. నేటి విద్యా వ్యవస్థకు అనుగుణంగా పాఠశాల యజమాన్యం విద్యాభివృద్ధికి చేస్తున్న సేవలను కొనియాడారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి అటు పాఠశాలకు, ఇటు తల్లిదండ్రులకు, మునిసిపాల్టీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని తిలకించి వైజ్ఞా విజ్ఞాన అంశాలపై విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్న తీరును అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను పాఠశాల యజమాన్యం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభు (బొల్లారం పబ్లిక్ స్కూల్- కరస్పాండెంట్), మాజీ ఎంపీటీసీ కృష్ణంరాజు, సెంట్ జాన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, శ్రీను, ఉపాధ్యా యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే పాలనా లక్షణాలు కలిగి ఉండాలి



నవతెలంగాణ-జహీరాబాద్

ప్రతీ ఒక్కరూ విద్యార్థి దశ నుంచే పాలనా లక్షణాలను నేర్చుకోవాలనే లక్ష్యంతోనే పాఠశాలల్లో స్వయం పాలనా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు మాణిక్ ప్రభు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటయ్య అన్నారు. మాణిక్ ప్రభు ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. డీఈవోగా భవాని, ఎంఈఓగా వేణుగోపాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా గాయత్రి ఎంతో చక్కగా విధులు నిర్వహించారు. మిగతా విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులైన విద్యార్థులకు పాఠశాల తరపున బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయ బృందం అరుణ, స్వరూప, నాగలక్ష్మి, కల్పన, అనిత, రాజేశ్వరి, శివశంకర్, రాహుల్, పవన్, మధు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌తో పేదల జీవితాల్లో వెలుగు

నవతెలంగాణ-ఐడిఏ బొల్లారం



లయన్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలతో పేదల జీవితాల్లో వెలుగు నిండుతున్నదని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నేత, బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మెన్ లయన్ అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ ఉన్నత పాఠశాల ఆయమ్మ పద్మమ్మకి రూ.2000 నెలసరి జీతాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మెగాసిటీ తరుపున ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో బొల్లారం మున్సిపాలిటీ స్థానిక ప్రజలు పాల్గొన్నారు



ఛాలెంజ్ ఫోటో స్టూడియో ప్రారంభోత్సవంలో స్ట్రీట్ చిల్డ్రన్ ఫౌండేషన్ అధ్యక్షులు

నవతెలంగాణ-నారాయణఖేడ్

హైదరాబాద్‌లోని మలక్‌పేట్‌లో ఏర్పాటు చేసిన ఛాలెంజ్ ఫోటో స్టూడియోను స్ట్రీట్ చిల్డ్రన్ ఫౌండేషన్ అధ్యక్షులు రాజేష్ చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా ఇన్వైట్ చేసిన నవీన్‌కి ధన్యవాదాలు తెలిపారు. ప్రతీ ఒక్కరికీ రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఫోక్ డాన్సర్ నీతు క్వీన్, సింగర్ బాలు కే అసుర, సింగర్ శ్రావణ్ డైమండ్, బీఆర్ఎస్ యువ నాయకులు పోతుల బొగుడ మోహన్, అనిల్ మౌర్య పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీని విజయవంతం చేయాలి

- పలు మండలాల్లో ముమ్మరంగా జీపుజాతలు

నవతెలంగాణ-జోగిపేట, పుల్కల్, నారాయణఖేడ్, కల్హేర్, సంగారెడ్డి, కొండాపూర్, హత్నూర్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న ఢిల్లీలో తలపెట్టిన మజ్దూర్, కిసాన్ సంఘర్ష్ ర్యాలీని జయప్రదం చేయాలని జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం జీపుజాతను నాయకులు చేపట్టారు. జోగిపేట, పుల్కల్, నారాయణఖేడ్, సిర్గాపూర్, కల్హేర్, నిజాంపేట్ మండలాల్లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ. సాయిలు.. సంగారెడ్డి, కొండాపూర్, హత్నూర మండలాల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింలు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.యాదవరెడ్డి, సీఐటీయూ జిల్లా నాయకులు బి.నాగేశ్వరరావులు ర్యాలీ చేపట్టి.. ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాటాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు తమ గళాలను మోడీ సర్కారుపై ఎక్కుపెట్టాలని కోరారు. మోడీ సర్కారు కార్పొరేట్ అనుకూల విధానాలు దేశ భవిష్యత్‌కే నష్టదాయకమని హెచ్చరించారు. ఐక్యపోరాటాలతో వాటిని తిప్పికొట్టాల్సిన బాధ్యత నిజమైన దేశభక్తులపై ఉందన్నారు. కులం, మతం పేరుతో ఉన్మాద చర్యలను ప్రోత్సహిస్తూ బీజేపీ రాజకీయ లబ్ది పొందుతున్నదని.. వాటికి ప్రయోగశాలలుగా కర్నాటక, తెలంగాణను మార్చాలని చూస్తున్నదని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలను చైతన్యపర్చాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. కార్మిక చట్టాలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మారుస్తూ, కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్మికుల జీవితాలతో ఆటలాడుతున్న ప్రభుత్వానికి కార్మిక సత్తాను చాటాలన్నారు. ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల పట్ల మోడీ సర్కారు అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌లో ఆహారభద్రతకు 90 వేల కోట్ల రూపాయల కోత పెట్టిన తీరును వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడు తున్న ఆహార కొరతను ఆసరాగా తీసుకుని లక్షల కోట్ల రూపాయల లాభాలను గడించాలనే ఉద్దేశంతోనే అంబనీ, అదానీ కన్ను వ్యవసాయ రంగంపై పడిందన్నారు. దేశ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగాన్ని, లౌకికత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిపైనా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోగిపేటలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాజయ్య, సీఐటీయూ అందోల్ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్, నాయకులు రాములు, శివకుమార్, రాహుల్, పాషా, శ్రీకాంత్, షకీల్, అశోక్, రాజు, ఖేడ్‌లో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాజయ్య, సీఐటీయూ నారాయణఖేడ్ డివిజన్ నాయకులు చిరంజీవి, నాయకులు నరేష్, దుర్గయ్య, లక్ష్మణ్, శంకర్, పుల్కల్‌లో సీఐటీయూ అందోల్ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్, మండల కార్యదర్శి కృష్ణ, రైతు సంఘం మండల నాయకులు దశరథ్, వెంకటేశం, రాములు, హత్నూరలో సీఐటీయూ మండల నాయకులు షబ్బీర్, వ్యకాస నాయకులు శ్రీకాంత్, వేణు, కొండాపూర్‌లో మండల కన్వీనర్ బాబురావు, నాయకులు రాములు, రత్నయ్య, సంజీవులు, వెంకయ్య, ప్రభు పాల్గొన్నారు.









శ్రీ శోభకృత్ నామ సంవత్సరానికి స్వాగతం

రావమ్మా... శ్రీశోభకృత్ నామ సంవత్సరమా..
శుభకృత్ పంచిన ఆనందమకరందాలను
ప్రస్తావిస్తూ,
షడ్రుచ భరితమైన జీవితపచ్చడిని
ఆస్వాదింపజేపిస్తూ,
ఎల్లవేళలా ఎల్లరకు ఎల్లలు దాటిన
సుఖసంతోషాల స్రవింతిస్తూ,
పాడిపంటల భోగభాగ్యాలతో తులతూగుతూ,
అపజయాలతో అల్లల్లాడిన వారి బ్రతుకున గంటలు
మోగిస్తూ,
ఆకాశమే హద్దుగా విజయకేతనమెగిరేస్తూ,
అంతకంతకూ కతకని చితికిన అతుకుల బతుకుల
వెతలు తీరుస్తూ,
మనసులో తరింప జేస్తూలి కష్టాలను మరిపిస్తూ,
మదిలో మధురిమలు కురిపిస్తూ,
మెరిపిస్తూ, మైమరపిస్తూ..
సంతసాల మనోహరివై రావమ్మా ...



శ్రీశోభకృత్ నామ
సంవత్సరమా
- బళ్మారి శ్రీనివాస చారి,
జి.ప.ఉ.పా. పుల్కల్
9441560672
నవతెలంగాణ-జోగిపేట

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



నవతెలంగాణ-జహీరాబాద్

మహిళా సాధికారతే తమ ప్రభుత్వ లక్ష్యమని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో మెప్మ, మండల మహిళా సమక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా సంఘాలకు రూ.5 కోట్ల 76 లక్షల వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేశామన్నారు. స్వయం సహాయక సంఘాలు క్రమం తప్పకుండా బ్యాంకులకు రుణాలు సకాలంలో చెల్లించి బ్యాంకుల మన్ననలు చూరగొన్నదని, నేడు బ్యాంకులను నడిపిస్తున్న గౌరవం మహిళలకే దక్కిందన్నారు. ఆడపిల్లలను బాగా చదివించాలని, వారు ఆర్థికంగా నిలదొక్కుకొని స్వావలంబన సాధించిన నాడే వివాహాలు చేయాలని, తద్వారా ఎటువంటి కష్టాలైనా ఎదుర్కొనే మనో స్థైర్యం, ధైర్యం వస్తుందన్నారు. అనంతరం 3161 స్వయం సహాయక సంఘాలకు 2018-19, 20 సంవత్సరాలకు సంబంధించి వడ్డీ లేని రుణ బకాయిలు రూ.5 కోట్ల 76 లక్షల 61 వెయిల రూపాయల వడ్డీ లేని రుణాల చెక్కులను మహిళ సంఘాల వారికి పంపిణీ చేశారు. జహీరాబాద్ పట్టణం 2227 ఎస్‌జిహెచ్ సంఘాలకు రూ.3,81,68,213, మొగుడంపల్లి మండలంలోని 349 ఎస్జీహెచ్ సంఘాలకు రూ.71,39,862, జహీరాబాద్ మండలంలోని 585 ఎస్సిహెచ్ సంఘాలకు రూ.12,35,3,165 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘాల ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ అభివృద్ధికి పాటు పడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, మంత్రి హరీశ్‌రావుకు, ఎమ్మెల్యే మాణిక్ రావుకు అండగా ఉంటామన్నారు. చెక్కులను అందుకోవడం సంతోషంగా ఉందని మహిళలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మొగుడంపల్లి జడ్పీటిసి మోహన్ రెడ్డి, డిస్ట్రిక్ట్ డిసిసిబి డైరెక్టర్ కిషన్ పవర్, మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, మాజీ జెడ్పీటీసీ మానెమ్మ, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సంజీవ్ రెడ్డీ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మోహివుద్దీన్, మొగుడంపల్లి మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్‌లు అల్లాడి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ఇంటింటికి చేరవేయాలి



నవతెలంగాణ-జిన్నారం

సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అనేక సంక్షేమ పథకాలను పేదలందరికీ అందేవిధంగా.. ఇంటింటికి చేరవేయాలని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిన్నారంలోని స్థానిక ఎస్ఆర్ఎస్ గార్డెన్‌లో బీఆర్ఎస్ నేతలు కుంచాల ప్రభాకర్, జిన్నారం వెంకటేశం గౌడ్, పులిగిల్ల ప్రకాశం చారి, జిన్నారం మండల శాఖ అధ్యక్షులు నాయికోటి రాజేష్ పలువురు సర్పంచులు ఎంపీటీసీల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గులాబీ శ్రేణుల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పథకాల ద్వారా లబ్ది పొందుతూ.. అభివృద్ధి పథంలో పయనిస్తున్న గ్రామాల తీరును కార్యకర్తలందరికీ వివరించాలన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, వివిధ రకాలైన పెన్షన్లు, రైతుబంధు, రైతుబీమా, కంటి వెలుగు, కేసీఆర్ కిట్, బస్తీ దవాఖానాలు, అన్ని వర్గాల వారికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మరింతగా విడమర్చి ఇంటింటికి తెలియజేయాలన్నారు. కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాలు, ఇతరత్రా సమావేశాలు కింది స్థాయి నుంచి నిర్వహిస్తూ ఇప్పుడు కార్యకర్తల్లో ఉన్న జోష్‌ను మరింత పెంచాలన్నారు. ఈనెల 27న జిన్నారం మండల గులాబీ దళ సమావేశాన్ని నిర్వహించాలని ఈ సందర్భంగా సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్, సీనియర్ నేత కుంచాల ప్రభాకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత జిన్నారం వెంకటేశం గౌడ్, గడ్డపోతారం సర్పంచ్ పులిగిల్ల ప్రకాశించారి, సర్పంచులు, పలువురు ఎంపీటీసీలు ఊట్ల సర్పంచ్ ఆంజనేయులు, నల్తూరు కొడకంచి అండూర్ పంచాయతీల సర్పంచ్లు జనార్ధన్ శెట్టి శివరాజ్ ఖదీర్, కాజిపల్లి గద్దె నరసింహ, వావిలాల, సోలక్‌పల్లి పీఏసీఎస్ చైర్మెన్లు శంకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో నష్టపోయిన రైతులకు అండగా ఉంటాం

నవతెలంగాణ-మునిపల్లి



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మునిపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. భారీ వర్షాల కారణంగా నష్టపోయిన గ్రామాలైన కంకోల్, మగ్దుంపల్లి మేల సంఘం, ఖమ్మంపల్లి చిన్న చెల్మెడ, అంతారం, మల్లికార్జునపల్లి అల్లాపూర్ గ్రామాల్లో ఉద్యావన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. నష్టపోయిన మామిడి జామ నిమ్మ, బొప్పాయి పండ్ల చెట్లను వివిధ రకాల పంటలు కూరగాయ పంటలను పరిశీలించారు. మండలంలో 86 ఎకరాలలో 39 మంది రైతులు నష్టపోయినట్టు సంబంధిత అధికారులు గుర్తించారు. ఆయన వెంట జెడ్పిటిసి సభ్యురాలు మీనాక్షి, ఉద్యావన శాఖ అధికారులు సునీత స్పందన, కీర్తి, శాస్త్రవేత్తలు డాక్టర్ సుచిత్ర డాక్టర్ హరినాథ్, డాక్టర్ మాధవి, డాక్టర్ మౌనిక, ఇతర అధికారులు నితీష్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికుమార్, మంతురి శేశికుమార్, పార్టీ నాయకులు కార్యకర్తలు, ఆయాగ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరుచేయండి

- గీతమ్‌లో ఘనంగా 'ప్రపంచ నీటి దినోత్సవం'

నవతెలంగాణ-పటాన్‌చెరు



ప్రతి ఒక్క పౌరుడూ తమ ఇంటి వద్దే తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా ఉండేలా చర్యలు చేపట్టాలని, కానీ దురదృష్టవశాత్తు మనదేశంలో కనీసం 20 శాతం మంది కూడా దీనిని ఆచరించడం లేదని అరబిందో ఫార్మా లిమిటెడ్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ - పర్యావరణం డాక్టర్ బీ.ఎస్ మూర్తి అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం 'ప్రపంచ నీటి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ మూర్తి మాట్లాడుతూ, తడి, పొడి చెత్తను ప్రజలంతా నేర్వేరు డబ్బాలలో వేయడం ప్రారంభించాలని, తడి వ్యర్థాలను ప్యాక్ చేయడానికి ప్లాస్టిక్ కవర్లను వినియోగించడం మానేయాలని డాక్టర్. మూర్తి హితవు పలికారు. వ్యర్థ ఆహారాన్ని ప్యాక్ చేసి, సీలు వేయడం వల్ల అది బాగా క్షీణిస్తుందని, దాని నుంచి ప్లాస్టిక్ పదార్థాన్ని వేరుచేయడం కష్టమని ఆయన చెప్పారు. ఈ వ్యర్థాలు నీటిలో చేరి, అవి వినియోగించడానికి వీల్లేకుండా మారడంతో పాటు పర్యావరణానికి చేటు చేస్తోందన్నారు. తెలంగాణలోని చాలా నీటి వనరులు కనీసం స్నానం చేయడానికి కూడా పనికి రాని విధంగా తయారయ్యాయని ఆయన విచారం వెలిబుచ్చారు. నీరు, పారిశుధ్య సంక్షోభాన్ని పరిష్కరించడానికి, మార్పును వేగవంతం చేయడానికి ప్రపంచ నీటి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని, ఎందుకంటే నీరు ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేస్తుందని, మార్పు ప్రతి ఒక్కరిలో వచ్చి నివారణ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. అరబిందో పరిశ్రమలో ఆచరిస్తున్న వ్యర్థాల నివారణ చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు జవాబులిచ్చారు. ఆలుత, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ దత్తాత్రి కె.నగేషా ప్రారంభోపన్యాసం చేసి, అతిథిని సత్కరించగా, కార్యక్రమ నిర్వాహకురాలు డాక్టర్ ఆర్.ఉమాదేవి వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులంతా నీటి సంరక్షణ ప్రతిజ్ఞ చేశారు. గోడపత్రికల రూపకల్పన, ముఖ చిత్ర లేఖనం వంటి పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

పార్టీ ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ ఆదేశాను సారం రేపటి నుంచి పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తామని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. మంగళవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలకు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించి వారిని చైతన్యవంతులను చేస్తామన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సీఎం కేసీఆర్ పై ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని, పార్టీ శ్రేణులు వాటిని తిప్పి కొడుతూ ప్రజలకు ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను కార్యకర్తలు వివరించాలన్నారు. పార్టీలోని కార్యకర్తలు, నాయకులు ఏకతాటిపై ఉండి పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలి అన్నారు. 9 ఏళ్లలో ప్రభుత్వం, సీఎం కేసీఆర్ అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మళ్లీ తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని పూర్తి విశ్వాసంతో ఉన్నారన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలలో తెలంగాణలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలు అన్ని రాష్ట్రాలలో అమలు చేసేందుకు బీఆర్ఎస్ పార్టీ నేతృత్వంలో ముందుకు వెళ్తామన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరిగిందన్నారు. పండగ వాతావరణంలో సమావేశాలు జరిగేలా ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్ జగన్ మోహన్ రెడ్డి, అందోల్ ఎంపీపీ జోగు బాలయ్య, జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్ ప్రవీణ్, మాజీ మార్కెట్ చైర్మన్ మల్లికార్జున్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అశోక్, రాష్ట్ర నాయకులు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి అనుమానాస్పద మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

- మృతుని కుటుంబానికి రూ.70లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కే.రాజయ్య

నవతెలంగాణ-గుమ్మడిదల



కొన్నేండ్లుగా పరిశ్రమలో పనిచేస్తున్న ఓ కార్మికుడు అనుమానాస్పదంగా మృతి చెందడం అనుమానంగా ఉన్నదని.. అతని మృతిపై వెంటనే సమగ్ర దర్యాప్తు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కే.రాజయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని బొంతపల్లి పారిశ్రామికవాడలో గల హెటిరో యూనిట్ వన్ పరిశ్రమలో చిదుపూడి శ్రీనివాస్‌రెడ్డి(42) అనే వ్యక్తి ప్రొడక్షన్ డిప్యూటీ మేనేజర్‌గా సుమారు 22 ఏండ్లుగా విధులు నిర్వహిస్తున్నాడన్నారు. అయితే ఇటీవలే ఆయన అనుమానాస్పదంగా పరిశ్రమలోనే మృతి చెందాడన్నారు. ఆయన మృతిపై అనుమానాలు ఉన్నాయని.. వెంటనే పోలీస్ ఉన్నత అధికారులతో దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలన్నారు. మృతుని కుటుంబానికి రూ.70 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన మృతికి గల అసలు కారణాలు తెలియాలంటే సమగ్ర దర్యాప్తు జరపాల్సిందేనన్నారు. వాస్తవాలు తెలియజేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మృతుని కుటుంబాన్ని ఆదుకుని.. పారిశ్రామిక వాడల్లో పనిచేస్తున్న వేలది మంది కార్మికులకు భరోసా కల్పిస్తూ హెటిరో యూనిట్ వన్ పరిశ్రమ ఆదర్శవంతంగా ఉండాలన్నారు.

అంధత్వ నిర్మూలనకే కంటివెలుగు

నవతెలంగాణ-కల్హేర్



గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ అంధత్వ నిర్మూలనకే రాష్ట్ర ప్రభుత్వం రెండోవిడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని సిర్గాపూర్ ఎంపీపీ జారా మహిపాల్‌రెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని సుల్తానాబాద్ (నల్లవాగు) గ్రామంలో గత రెండు రోజులుగా కొనసాగుతున్న కంటి వెలుగు క్యాంపు శిబిరాన్ని వారు మంగళవారం వేరు వేరుగా సందర్శించారు. రిజిస్ట్రేషన్ విధానాన్ని, కంటి పరీక్షలు నిర్వహించే విధానాన్ని పరిశీలించారు. కంటి పరీక్షలు నిర్వహించిన వారికి ఎంపీపీ చేతుల మీదుగా కళ్ళ అద్దాలను అందజేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. ఎవ్వరూ కూడా కంటిచూపు లోపంతో బాధపడొద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ఈ బృహత్కర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని.. కాబట్టి 18 ఏండ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగమని నర్సింలు, ఉప సర్పంచ్ నాగభూషణం, క్యాంప్ మెడికల్ ఆఫీసర్ అంబిండ్ పిహెచ్ఎన్ నిర్మల, మండల హెల్త్ సూపర్వైజర్ సుగుణ, అర్థమాట్రిస్ట్ సరిత, ఎంపీహెచ్ఏ రాంచందర్, ఏఎన్ఎంలు కృష్ణవేణి, కవిత, సురేఖ, క్యాంపు డీఈవో ప్రవీణ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు అంజయ్య సెట్, ఆశ కార్యకర్తలు కళావతి, లక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు యాదమ్మ పాల్గొన్నారు.


క్యాన్సర్ బాధితురాలికి వైద్యం కోసం ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఐడిఏబొల్లారం



కడప జిల్లాకు చెందిన రమణ, రామాంజులమ్మ అనే దంపతులు బతుకుదెరువు కోసం అయిదేండ్ల క్రితం వలస వచ్చి.. బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని వైస్సార్ కాలనీలో నివాసముంటున్నారు. అయితే కొన్ని రోజులుగా రామాంజులమ్మ బోన్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నది. కాగా వైద్య ఖర్చులకు డబ్బులు లేక ఆర్థికంగా వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని బీజేపీ నాయకులు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డికి తీసుకెళ్తే సాయం చేస్తారని స్థానికులు చెప్పడంతో.. వారు ఆనంద్ కృష్ణారెడ్డిని కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. దీంతో ఆయన వెంటనే స్పందించి రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు. కృష్ణారెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని బాధితులు తెలిపారు.

నవతెలంగాణ
మెదక్
బుధవారం 22 మార్చి 2023



బీవీ రాజు ఇంజనీరింగ్ కళాశాలలో వరల్డ్ వాటర్ డే కార్యక్రమం



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీ రాజు ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం కళాశాల ఆధ్వర్యంలో వరల్డ్ వాటర్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ విజయ్ ప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలోని సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు మిషన్ భగీరథ పథకం యొక్క ఆవశ్యకతను వివరించారు. నీటి నమూనాలు పరీక్షించి వాటి ఫలితాలను విద్యార్థులకు చూపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్ దూబే, మేనేజర్ బాపిరాజు, ప్రొఫెసర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



చికెన్ ధరలు (కే.జీ)

ఫాంరేటు	- రూ. 85
రిటైల్	- రూ. 107
విత్‌స్కిన్	- రూ. 155
స్కిన్‌లెస్	- రూ. 177

అందరి జీవితాల్లో వెలుగు నింపాలి



నవతెలంగాణ-టేక్మాల్

గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేద ప్రజల కళ్లల్లో వెలుగు నింపాలని మెదక్ జిల్లా ఆదరణ కలెక్టర్ ప్రతిమ సింగ్ అన్నారు. మంగళవారం మసన్మాన్పత్ పల్లి కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించిన అనంతరం, రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయని ఎంతమంది ఆపరేషన్ కోసం సిఫారసు చేశారని, ఎన్ని పేర్లు నమోదు అయ్యాయని డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అవసరం ఉన్నవారికి అద్దాలు పంపిణీ ప్రభుత్వమే చేస్తుందని చెప్పారు. సకాలంలో వైద్యులు అందుబాటులో లేకపోతే తమకు ఫోన్ చేసి చెప్పాలని సూచించారు. విధులపై నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అనంతరం నర్సరీని సందర్శించి మొక్కలను పరిశీలించి పండ్ల మొక్కలను పెంచాలని సర్పంచ్ లావణ్య రెడ్డికి సూచించారు.

నాటిన మొక్కలను సంరక్షించుకోవాలి.



నవతెలంగాణ-పెద్దశంకరంపేట

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎస్‌ఆర్ వో) వికాస్ అన్నారు. మంగళవారం స్థానిక ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా అటవీశాఖ అధికారులతో కలిసి మొక్కలు నాటిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మొక్కలపైనే మానవాళి మనుగడ ఆధారపడి ఉందన్నారు. చెట్లను నరకడం వలన మన ఆయుష్షును మనం తగ్గించుకున్నట్లేనని పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతిని కరువు కాటకాలు ఏర్పడుతున్నాయన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ ఐదు మొక్కలు నాటి బాధ్యతగా సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. మండలంలోని పల్లెలన్నీ పచ్చని చెట్లతో కళకళలాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్బీవో ప్రవీన్, సర్పంచ్ లక్ష్మి, సిబ్బంది మనస్విని, స్రవంతి, తదితరులున్నారు.

చెరువులో గల్లంతైన యువకుని మృతదేహం లభ్యం



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ రాయరావు చెరువులో గల్లంతైన యువకుడు భార్గవ్ మృతదేహం లభ్యమయింది. సోమవారంహైదరాబాద్ కూకట్‌పల్లి చెందిన భార్గవ్ స్నేహితురాలితో కలిసి అర్బన్ పార్క్‌ను సందర్శించిన భార్గవ్ ప్రమాదవశాత్తును నర్సాపూర్ రాయ రావు చెరువులో పడి గల్లంతైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎస్సై శివకుమార్ తహసీల్దార్ ఆంజనేయులు రాత్రి పొద్దుపోయే వరకు ఈతగాళ్లతో చెరువులో గాలించిన భార్గవ్ మృత దేహం లభించలేదు. అయితే మంగళవారం ఉదయం రాయరావు చెరువులో ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టగా మృతి చెందిన భార్గవ్ మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి శవాన్ని మృతుడి తల్లికి అప్పగించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

బహిరంగ సభకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



నవతెలంగాణ-నర్సాపూర్

సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న జన చైతన్య యాత్ర సందర్భంగా ఈ నెల 25న జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలో సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న భారీ బహిరంగ సభకు రావాలని కోరుతూ మంగళవారం హైదరాబాదులోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు వెళ్లి ఎమ్మెల్యే మదన్ రెడ్డిని. మెదక్ జిల్లా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ మల్లేశం, జిల్లా నాయకులు నరసమ్మ, కడారి నాగరాజు, మల్లేశంలు ఎమ్మెల్యే మదన్ రెడ్డిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లేశం మాట్లాడు తూ బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివ రించేందుకే సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే ఈ నెల 25న మెదక్ పట్టణంలో 12 గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు ఈ బహిరంగ సభకు రావాలని ఎమ్మెల్యే మదన్ రెడ్డిని ఆహ్వానించినట్లు మల్లేశం తెలిపారు.

చలో విద్యుత్ సౌధాను విజయవంతం చేయాలి

రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆర్గనైజర్ రవీందర్




నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సమస్యలు, హక్కుల సాధనకై టీఎస్‌పీఈ జాక్ చేపట్టిన ఛలో విద్యుత్ సౌధా కార్యక్రమానికి ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆర్గనైజింగ్ సెక్రటరి గుడాల రవింద్రప్రసాద్ కోరారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యలతో పాటు హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ చలో విద్యుత్ సౌధా కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. ముఖ్యంగా వేతన సవరణ 2022, ఈపీఎఫ్ నుండి జీపీఎఫ్ (1999/ 2004), ఆర్టిజన్ సమస్యలతో పాటు మరికొన్ని సమస్యల సాధన కోసం ఈనె 24న చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో విద్యుత్ ఉద్యోగులు హజరై విజయవంతం చేయాలని గుడాల రవింద్రప్రసాద్ తెలిపారు.

అనుమతులు లేకుండా షెడ్లు నిర్మిస్తే చర్యలు

ఎంపీవో లక్ష్మి నర్సింలు



నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

గ్రామపంచాయతీ అనుమతులు లేకుండా ఎలాంటి ఇండ్లు కానీ షెడ్లు కానీ నిర్మాణాలు చేపట్టరాదని, నిర్మిస్తే చర్యలుంటాయని మనోహరాబద్ ఎంపీవో లక్ష్మినర్సింలు పేర్కొన్నారు. మెదక్ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం గ్రామంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఇండ్లు, షెడ్లను వారు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ కేవలం మూడు వందల చదరపు మీటర్ల మేరకు మాత్రమే గ్రామపంచాయతికి అనుమతులు ఇచ్చే అధికారం ఉందని, 300 చదరపు మీటర్లు కాకుండా ఎక్కువ ఉన్న వాటికి హెచ్‌ఎండీఏ ద్వార అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. నాలుగు షెడ్లను పరిశీలించి, వారికి ఉన్న అనుమతుల పత్రాలను పంచాయతికి సమర్పించాలని ఆదేశించారు. అనంతరం ఎంపీవో మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లలో ప్లాట్లను కొనుగోలు చేయవద్దని అన్ని పరిశీలించిన తరువాతే కొనుగోలు చేయాలని సూచించారు. అలాగే 300 చదరపు మీటర్లలోపున్న షెడ్లకు అనుమతులు ఇచ్చే అధికారం గ్రామపంచాయతికి ఉంటుందని అంతకు మించి ఉన్న వాటికి హెచ్‌ఎండీఏ ద్వార అనుమతులు పొందాలని ఆదేశించారు. దళారులను నమ్మి మోసపోవద్దని ఎంపీవో లక్ష్మినర్సింలు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి శంకర్‌గౌడ్, కారోబార్ శేషు, తదితరులు పాల్గొన్నారు.

25న జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలి







నవతెలంగాణ-మెదక్ టౌన్

బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక, సామ్యవాద, లౌకిక న్యాయ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం కోరారు. మంగళవారం జిల్లా కేంద్రం మెదక్‌లోని కేవల్ కిషన్ భవనంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ విధానాలను వ్యతిరేకించేందుకు ప్రజాస్వామ్యాన్ని సామాజిక న్యాయాన్ని కాపాడుకునేందుకు సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన జన చైతన్య యాత్రలు రాష్ట్రంలో మూడు యాత్రలు జరుగుతున్నాయన్నారు. దాంట్లో భాగంగానే మార్చి 24వ తేదీన నిజాంబాద్ జిల్లాలో మూడవ యాత్ర ప్రారంభమై మెదక్ జిల్లాకు 25వ తేదీన జిల్లాలోని రామాయంపేట మండలానికి ఉదయం 10 గంటల వరకు చేరుకుంటుందన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు కట్టబెడుతూ ప్రజలపై భారాలను మోపుతుందన్నారు. 2014లో 410 రూపాయలు ఉన్న గ్యాస్ ధర నేడు 1350 కి పెరిగిందన్నారు. ఈ ధరల పెరుగుదల వల్ల కార్పోరేట్ల వేలకోట్ల రూపాయల లాభాలను పోగేసుకుంటారన్నారు. కంపెనీల మోసాన్ని అమెరికా సంస్థలు బట్టబయలు చేసిందన్నారు. 15 లక్షల కోట్ల ప్రజా సంపద ఆవిరి అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సామాన్య ప్రజలు పేద ప్రజలు మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడు కునేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధపడిందన్నారు. బిజెపి ప్రభుత్వ పాలనపై విమర్శలు చేసిన మీడియాపై ప్రజాస్వామ్య దాడులపై తీవ్రమైన దాడులకు దిగబడుతుందన్నారు. .25వ తేదీన మెదక్ జిల్లాలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయడానికి జిల్లాలోని కార్మికవర్గం, ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయడానికి అందరూ తమ వంతు కృషిగా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే మల్లేశం మానవ హక్కుల సంఘం జిల్లా నాయకులు బట్టి భూపతి టిడిపి జిల్లా నాయకులు కరీం బీఎస్పీ జిల్లా అధ్యక్షులు అప్పాజీపల్లి సురేష్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దేవయ్య కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లచ్చ గౌడ్ నాయకులు షౌకత్ అలీ తదతరులు ఉన్నారు.

నవతెలంగాణ- కొల్చారం

కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక, సామ్యవాద, లౌకిక న్యాయ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న జన చైతన్య బస్సు యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కె.నర్సమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రం కొల్చారంలో జన చైతన్య ప్రచార యాత్ర పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సభ్యురాలు నర్సమ్మ మాట్లాడుతూ సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన జన చైతన్య యాత్రలు రాష్ట్రంలో మూడు యాత్రలు జరుగుతున్నాయన్నారు. దాంట్లో భాగంగానే మార్చి 24వ తేదీన నిజాంబాద్ జిల్లాలో మూడవ యాత్ర ప్రారంభమై మెదక్ జిల్లాకు 25వ తేదీన జిల్లాలోని రామాయంపేట మండలానికి ఉదయం 10 గంటల వరకు చేరుకుంటుందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు కట్టబెడుతూ ప్రజలపై భారాలను మోపుతుందని విమర్శించారు. అలాగే 23 కోట్ల మందిని పేదలుగా మార్చారని ఆమె మండిపడ్డారు. అదేవిధంగా ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడం ద్వారా రిజర్వేషన్లను ఎస్సీ, ఎస్టీ, బీసీలు కోల్పోతున్నారని తెలిపారు. వీటన్నిటిని ఎదుర్కొనేందుకు సీపీఐ(ఎం) పార్టీ జనచైతన్య యాత్రల పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేయడానికి పూనుకుందని స్పష్టం చేశారు. 25వ తేదీన మెదక్ జిల్లాలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయడానికి జిల్లాలోని కార్మికవర్గం, ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషిగా సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సిహెచ్.సతయ్య, రాములు, శేకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-వెల్దుర్తి

కేంద్రలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక సామ్యవాద లౌకిక న్యాయ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న జన చైతన్య బస్సు యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గౌరీ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గౌరీ ఆధ్వర్యంలో జన చైతన్య యాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు ఈ సందర్భంగా గౌరీ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు కట్టబెడుతూ ప్రజలపై భారాలను మోపుతోందన్నారు 23 కోట్ల మందిని పేదలుగా మార్చారని మండిపడ్డారు కార్పొరేట్ విధానాలను వ్యతిరేకించేందుకు ప్రజాస్వామ్య సామాజిక న్యాయాన్ని కాపాడుకునేందుకు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జనచైతన్య యాత్రలు జరుగుతున్నాయన్నారు. 2023 మార్చి 17 నుంచి 29 వరకు జన చైతన్య యాత్రలో ప్రజలు ప్రజాస్వామ్యవాదులు లౌకికవాదులు మేధావులు భాగస్వాములు కావాలన్నారు. దేశం అంటే అంబానీ ఆదానిల సొత్తుగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు రోజువారి ఉపయోగించే నిత్యవసర సరుకుల ధరలు నూనెలు గ్యాస్ పెట్రోల్ డీజిల్‌తో సహా అన్ని రకాల రేట్లు మూడు రేట్లు అధికంగా పెంచారని మండిపడ్డారు. 2014లో 410 ఉన్న గ్యాస్ ధర నేడు రూ 1350 కి పెరిగిందన్నారు 25న మెదక్ జిల్లాలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయడానికి జిల్లాలోని కార్మిక వర్గం ప్రజలు రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు పాల్గొన్నారు.

ప్లాట్లలోకి వెల్లకుండా రోడ్డును కబ్జా చేశారు

వెల్లిన వారిపై దౌర్జన్యానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ప్లాట్ల వద్ద బాధితుల ఆందోళన



నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

రియల్ వ్యాపారులు ఏర్పాటు చేసిన అనుమతి గత వెంచర్‌లో తాము కష్టపడి సంపాదించిన డబ్బులతో కొనుగోలు చేశామని కానీ కొందరు అక్రమంగా తమ ప్లాట్లకు వెల్లకుండా రోడ్డును కబ్జాచేశారని, అడిగితే తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలంటూ ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు వెంచర్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సంఘటన మండలంలోని కాళ్ళాకల్‌లో మంగళవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలంలోని కాళ్లాకల్‌లో సర్వే నంబర్ 310, 311, 312, 313, 320, 382లలో 42 ఎకరాల భూమిలో 2003లో తరున్ గార్డెన్స్ (ఆర్‌ఆర్‌సి) వెంచర్‌ను గ్రామపంచాయతీ అనుమతితో 500 ప్లాట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాము కూలీ పనులు చేసుకుంటూ, ప్రైవేటు పరిశ్రమలలో ఉద్యోగం చేసుకుంటూ పిల్లల భవిష్యత్తు కోసం వెంచర్‌లో ప్లాట్లను కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్లాట్లు కొనుగోలు చేసే ముందు రెవెన్యూ అధికారులను, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్లాట్ల కోసం తెలుసుకుంటే కొనుగోలు చేసుకోవచ్చని తెలపడంతోనే ప్లాట్లను కొనుగోలు చేసినట్టు తెలిపారు. గత 2003 సంవత్సరంలో హైవే రోడ్డుకు ఆనుకుని వెంచర్‌ను ఏర్పాటు చేసి ప్లాట్లను చేశారని అందులో నుంచే వెనకాల ఉండే ప్లాట్లకు వెల్లడానికి రోడ్డును కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. కానీ కొందరు ఈ భూమి తమదంటూ ఇతరులకు లీజుకు ఇవ్వడంతో వారు రోడ్డును కబ్జాచేసి హద్దులను తొలగించి కబ్జాచేశారని తెలిపారు. తాము ప్లాట్ల వద్దకు వస్తే తమను ఆడవాళ్లని కూడా చూడకుండా భూతులు తిడుతూ గొడ్డలితో కొట్టడానికి వచ్చారని వారి నుంచి తమకు ప్రాణభయం ఉన్నట్టు బాధితులు తెలిపారు. అలాగే రోడ్డుకు ఆనుకుని ఉన్న వెంచర్‌లో ప్లాట్లను ఏర్పాటు చేశారని ఆ ప్లాట్లను పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలక్రిష్ణారెడ్డి, బాషబోయిన చంద్రశేఖర్ ముదిరాజ్, కాళ్లాకల్ సర్పంచ్ తనయుడు, తూప్రాన్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కావేరిగారి భగవాన్‌రెడ్డిలు నాలుగు ప్లాట్లను కొనుగోలు చేశారు. దాంతో తమ భూమి అంటూ కొందరు వచ్చి గొడవకు దిగడంతో కోర్టుకు వెల్లగా ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చారని తెలిపారు. అట్టి గొడవలు ఉన్న భూమిని మండలానికి చెందిన నాయకులు యంజాల సుదాకర్‌రెడ్డి, యంజాల విఠల్‌రెడ్డిలు లీజుకు తీసుకుని ప్లాట్ల హద్దులను తొలగించి కబ్జా చేయడంతో పాటు ప్లాట్లకు చుట్టూ ఉన్న ఫ్రీ కాస్ట్ వాల్‌ను తొలగించారని అలాగే వెనకాల ఉన్న ప్లాట్లకు వెల్లకుండా రోడ్డును కబ్జాచేశారని తెలిపారు. అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలంటూ బాధితులు మంగళవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కల్తీ ఆహార పదార్థాలు తయారుచేస్తే కఠిన చర్యలు

ఫుడ్ ఇన్స్పెక్టర్ సునీత



నవతెలంగాణ-నర్సాపూర్

కల్తీ ఆహార పదార్థాలు తయారు చేసి విక్రయించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ ఇన్స్పెక్టర్ సునీత అన్నారు. నర్సాపూర్ పట్టణంలోని సంగారెడ్డి వెళ్లే మార్గంలో ఉన్న ఓ మండిలో శనివారం సాయంత్రం కొంతమంది బిరియాని తిని వాంతులు విరోచనాలు కావడంతో పాటు అస్వస్థతకు గురయ్యారు. వీరు నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా వారికి వైద్యులు చికిత్సలు అందించారు. అయితే ఫుడ్ పాయిజన్ వల్లే అస్వస్థతకు గురయ్యారని డాక్టర్లు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఫుడ్ ఇన్స్పెక్టర్ సునీత డిప్యూటీ డిఎం హెచ్‌ఓ విజయనిర్మల మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్‌లు మండిని సందర్శించి అందులో ఉన్న వంటకు వాడే పదార్థాలను వంటకాలను పరిశీలించారు. అనంతరం ఫుడ్ ఇన్స్పెక్టర్ సునీత మాట్లాడుతూ బిర్యానీలో వాడే కలర్ వల్ల ఈ సంఘటన జరిగి ఉండొచ్చన్నారు. ఈ మేరకు కలర్ ఇతర పదార్థాల శాంపిల్‌ను సేకరించామన్నారు. ఈ శాంపిల్‌ను నాచారంలో ఉన్న స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించడం జరుగుతుందన్నారు. అందులో వచ్చిన రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

మత్స్యకార సొసైటీ సభ్యులకు నైపుణ్య పరీక్ష

జిల్లా ఫిషరీస్ ఏడీ రజని



నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

మత్స్యకార సొసైటీల సభ్యులందరూ చేపలు పట్టడంలో నైపుణ్యాన్ని కలిగి ఉండాలని సభ్యులకు నైపుణ్య పరీశీల చేపట్టినట్టు జిల్లా ఫిషరీస్ ఏడీ రజని తెలిపారు. మనోహరాబాద్, తూప్రాన్ మండలాలకు చెందిన ఏడు సొసైటీలకు కోనాయిపల్లిలో నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తుండగా కేవలం ఐదు గ్రామాలు కోనాయిపల్లి, ధర్మరాజ్‌పల్లి, చెట్లగౌరారం, వెంకటాయిపల్లి, వట్టూరులకు చెందిన సొసైటీల సభ్యులు 200 వరకు హజరైనట్టు తెలిపారు. మంగళవారం మండలంలోని ధర్మరాజ్‌పల్లి గ్రామంలోని పెద్ద చెరువులో సంఘ సభ్యులకు నైపుణ్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు బాషబోయిన చంద్రశేఖం "ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ సభ్యులు తప్పనిసరిగా సొసైటీలో సభ్యత్వం పొందాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్య సహకార సొసైటీల సభ్యుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చినట్టు తెలిపారు. సభ్యులకు ప్రమాద భీమాతో పాటు ఉచితంగా వాహనాలను అందించి వారి ఆర్థిక పరిపుష్టికి తోడ్పడుతున్నట్టు తెలిపారు.సొసైటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పండిత్, నాయకులు గణేష్, ధవరథ, రమేష్‌లతో పాటు అధిక సంఖ్యలో ఐదు గ్రామాల సొసైటీల సభ్యులు హజరయ్యారు.

సివి రామన్ పాఠశాలలో ఉగాది వేడుకలు



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలోని సి.వి.రామన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో మంగళవారం విద్యార్థులు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉగాది పచ్చడి తయారు చేసి తోటి విద్యార్థులకు అందజేశారు. ఉగాదితో నూతన సంవత్సరంలోకి అడుగు పెడుతున్నామని ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాయిత నారాయణరెడ్డి కోరారు.

జిల్లా ప్రజలకు కలెక్టర్ ఉగాది శుభాకాంక్షలు



నవ తెలంగాణ-మెదక్ రూరల్

తెలుగు నూతన సంవత్సరం శోభకృత్ నామ ఉగాది పర్వదినం సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మెదక్ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, తీపి, చేదు, వగరు, పులుపు కలగలిపిన షడ్రుచుల సమ్మేళనమే ఉగాది పచ్చడని, సంవత్సరం పొడుగునా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సంయమనంతో స్వీకరించాలన్న సందేశాన్ని ఉగాది పచ్చడి మనకు తెలియజేస్తోందన్నారు. ఈ పర్వదినాన పంచాంగ శ్రావణం జరుపుకోవడంతో పాటు రాశిఫలాలు, గ్రహస్థితులు ఎలా ఉంటాయో తెలుసుకుంటారని అన్నారు. ఈ తెలుగు నూతన సంవత్స రాదిలో కొత్త ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని, అందరు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో విలసిల్లాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరు తమకంటూ నూతన లక్ష్యాలను నిర్దేశించుకొని, ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు.

అంబేద్కర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

మాల మహానాడు అధ్యక్షుడు



నవతెలంగాణ-నిజాంపేట

భారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిజాంపేట మండలం మాల మహానాడు అధ్యక్షుడు బండారి చంద్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా నిజాంపేట మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ భారతదేశ దిశా దశను మార్చిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని , బడుగు బలహీన వర్గాల మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించి వారి జీవితాలనే మార్చేసిన ఆశాజ్యోతి బాబాసాహెబ్ అంబేద్కర్ అని ఆయన కొనియాడారు.

ఎమ్మెల్యే ఉగాది శుభాకాంక్షలు



నవతెలంగాణ-మెదక్ రూరల్

తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం (శోభకృత్ నామ సంవత్సరం) సందర్భంగా మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు ఎమ్మెల్యే యం. పద్మాదేవేందర్ రెడ్డి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కొత్త ఏడాదిలో అందరికీ శుభమే జరగాలని ఆకాంక్షించారు. ఉగాది తెలుగువారి తొలి పండుగని. షడ్రుచుల సంగమమే జీవితమని తెలిపే పండుగ అని అన్నారు. ఒకటి మధురం, రెండు పులుపు, మూడు లవణము, నాలుగు కారం, ఐదు చేదు, ఆరు వగరు ఈ షడ్రుచులు కలిసిందే మన జీవితమని తెలిపారు.ఈ పండు గను ఆనందంగాను, ఉత్సాహంగా జరుపుకోవాలని, ప్రజలంతా ఆయు రారోగ్యాలతోను, అష్టైశ్వర్యాలతోను తులతూగాలని అభిలాషించారు.

ఉగాది శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి



నవతెలంగాణ-హవేలీ ఘనాపూర్

తెలుగు నూతన సంవత్సరాది శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా సీఎం కేసీఆర్ రాజకీయ కార్యదర్శి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి ప్రజలకు శుభాకాంక్షలు మంగళవారం తెలిపారు. షడ్రుచుల ఉగాది పర్వదిన సందర్భంగా శోభకృత్ నామ సంవత్సరంలో ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, సకల సంపదలు, ఆనందాలు వెల్లివిరియాలని ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి అభిలషించారు. ఈ ఉగాది పర్వదినాన్ని సుఖ సంతోషాలతో ఆనందోత్సాహాల మధ్య ప్రజలందరూ నిర్వహించుకోవాలని ఎమ్మెల్సీ ఆకాంక్షించారు. ఉగాది పర్వదినం ప్రజలందరి కుటుంబాల్లో కొత్త వెలుగు నింపాలని ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి భగవంతున్ని ప్రార్థించారు. ఈ శోభకృత్ నామ సంవత్సరంలో ప్రజలకు అన్ని శుభాలు కలగాలని, సమృద్ధిగా వానలు కురవాలని ఎమ్మెల్సీ కోరుకున్నారు. పంటలు బాగా పండాలని, రైతులకు మేలు జరగాలని, సకల వృత్తుల వారు ఆనందంగా ఉండాలని ఎమ్మెల్సీ ఆకాంక్షించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌లకు మొబైల్ సిమ్ కార్డులు

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో కుమారస్వామి ఫీల్డ్ అసిస్టెంట్ లకు, సిబ్బందికి మొబైల్ సిమ్ కార్డులను పంపిణీ చేశారు. ఉపాధి హామీ పనుల వద్దే కూలీల వివరాల నమోదు ప్రక్రియ ఉంటుందని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పద్మ, టీఏలు సురేష్, పర్శరములు, వెంకటేష్ , సి ఓ శ్రీధర్, ఫీల్డ్ అసిస్టెంట్ ల సంఘము అధ్యక్షుడు సదానందం, ఫీల్డ్ అసిస్టెంట్ దేవేందర్, అన్నపూర్ణ, రవి, నందయ్య, సునీత, శైలజ, స్వప్న, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం



నవ తెలంగాణ - సిద్దిపేట

స్థానిక ప్రెస్ క్లబ్ లో సిద్దిపేట జిల్లా రచయితల సంఘం(సిరసం), శ్రీ వాణీ సాహిత్య పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో అమ్మనా చంద్రారెడ్డి అధ్యక్షతన శోభకృత్ ఉగాదిని పురస్కరించుకొని నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. సుమారు 30 మంది కవులు తమ కవితలను వినిపించారు. వైవిధ్యభరితమైన కవితలతో కవి సమ్మేళనం శ్రోతలను అలరించింది. ఈ సందర్భంగా పాల్గొన్న కవులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అమ్మను చంద్రారెడ్డి, పెందోట వెంకటేశ్వర్లు, కవులు మిట్టపల్లి పరశురాములు, మురళీధర శర్మ, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ 4



సిద్దిపేట

బుధవారం 22 మార్చి 2023

టీఎస్పీఎస్సీలో భారీ కుంభకోణం



నవ తెలంగాణ-మిరుదొడ్డి

టీఎస్ పీఎస్సీలో భారీ కుంభకోణం జరిగిందని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని తెలుగుదేశం పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ ఇల్లందుల రమేష్ డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత మోసం చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. మిరుదొడ్డి మండలంలోని ఆరేపల్లి, లక్ష్మీ నగర్, లింగుపల్లి, చెప్యాల గ్రామాల్లో ఇంటింటికి టిడిపి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ ఇల్లందుల రమేష్ పాల్గొని తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను కరపత్రాలను పంచుతూ వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు జహంగీర్, టిడిపి నాయకులు ఆకుల రాములు, శంకర్ గౌడ్, రవీందర్, రమేష్ గౌడ్, మహేష్, లింగం, బిక్షపతి, ఎల్లయ్య, ఖాదర్ పలువురు పాల్గొన్నారు.

23న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-నంగునూరు

ఈ నెల 23న నంగునూరు మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ జాప అరుణాదేవి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఇంచార్జి ఎంపీడీవో వేణు గోపాల్ తెలిపారు.నంగునూరు మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు సమయానికి హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని ఆదేశించారు. ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు హాజరయ్యే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని పేర్కొన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-తొగుట

విద్యార్థులకు అంబలి కేంద్రం ప్రారంభించామని ఎస్ఎంసీ చైర్మన్ జంగిటి భిక్షపతి తెలిపారు. మంగళవారం మండలంలోని రాంపూర్ పాఠశాల లో ఉగాది సంబరాలు, చిన్నారుల కవి సమ్మేళనం, పిల్లలకి పచ్చడి, పోలెలు చేసే విధానాన్ని తెలిపా రు.అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. కార్య క్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిరుపేద వృద్ధులకు టవల్స్, పండ్లు పంపిణీ



నవ తెలంగాణ - సిద్దిపేట

గట్టు పద్మ- అమర్నాథ్ ల సహకారంతో కుశాల్ నగర్ లోని నిరాశ్రయుల ఆశ్రయంలోనీ నిరుపేద వృద్ధులకు బిర్యాని, బ్రెడ్ , పండ్లు టవల్స్ పంపిణీ చేసినట్లు వాసవి యూత్ క్లబ్ ప్రెసిడెంట్ అరవపల్లి హరికిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చకిలం రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిలోని ప్రతి వస్తువును కదిలించేదే కవిత్వం



నవ తెలంగాణ - సిద్దిపేట

కలం కదిలించి కవులు ప్రకృతిలో కనిపించిన ప్రతి వస్తువుపై కవిత్వం రాసి, సమాజ హితమే సాగుతారని జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షులు ఎన్నవెల్లి రాజమౌళి అన్నారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా సిద్దిపేటలో జరిగిన సమావేశంలో కవులు మాట్లాడుతూ ప్రకృతిలోని ప్రతి వస్తువు స్పర్శను తెలియజేసేదే కవిత్వమన్నారు. సమాజంలో చైతన్యం కొరకు అక్షర పదబంధాలతో ఆలోచనాత్మకంగా కదిలించే కవిత్వం తరగని సంపద అని అన్నారు. కవులు ఉండ్రాళ్ళ రాజేశం, వరుకోలు లక్ష్మయ్య, బస్వ రాజ్ కుమార్, కోణం పర్శరాములు, అనిశెట్టి సతీష్ కుమార్, శ్రీచరణ్ సాయిదాస్, మల్లంల కనకయ్య, తదితరులు పాల్గొన్నారు

ఉగాదిచిత్రం ఆవిష్కరించిన రుస్తుం



నవ తెలంగాణ - సిద్దిపేట

ఉగాది పండుగ ను పురస్కరించుకుని రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో మంగళవా రం ఉగాది శ్రీ శోభకృత్ వసంతం చిత్రాన్ని అంతర్జా తీయ చిత్రకారులు రుస్తుం ఆవిష్కరించారు. ఆర్ఏ ఎఫ్ అధ్యక్షురాలు జులేఖ రుస్తుం, నైరూప్య చిత్రకారుడు సహీంరుస్తుం, గ్రెట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రూబీనారుస్తుం, మహ్మద్ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది శుభాకాంక్షలు



నవ తెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పురపాలిక ప్రజలకు మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి "శోభక్రుత్ నామ సంవత్సర ఉగాది" శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ ఉగాది కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.తెలుగు ప్రజల తొలి పండుగ ఉగాది పర్వదినాన్ని పుర ప్రజలు ఆనందంగా జరుపుకోవాలన్నారు.

మున్నాళ్ల ముచ్చటేనా?

- నెల రోజులకే లేచిన తారు
- అసలే పనులు ఆలస్యం ఆపై నాసిరకం
- రోడ్డు వేశామా అంటే వేశామంతే!
- చిట్టాపూర్-చౌదర్ పల్లి బీటీ రోడ్డు పలుచన



నవ తెలంగాణ-దుబ్బాక

వారు ఆడిందే ఆట.. పాడిందే పాట.. మేం చేసేవే పనులు అన్నట్లుగా ఉంది కాంట్రాక్టర్ తీరు. తక్కువ మందంతో రోడ్డు వేయడంతో వేసిన నెల రోజులకే బీటీ రోడ్డుపై తారు లేచింది. అసలు ఇది బీటీ రోడ్డు కాదని గ్రామస్తులు అంటున్నారు. 8 ఏళ్ల కిందట మొదలైన బీటీ రోడ్డు పనులు ఈ ఏడాది ఫిబ్రవరిలో పూర్తయ్యాయి. ఇన్నేళ్ళుగా ఎదురుచూసిన ఇక్కడి ప్రజలకు అసంతృప్తే మిగిలింది. మూన్నాళ్ల ముచ్చటేనా అన్నట్టు ఉన్నాయి ఈ పనులు. అసలే ఆలస్యమంటే ఆపై నాసిరకంగా ఏదో రోడ్డు వేశామా అంటే వేశాం అన్నట్లుగా చేతులు దులిపేసుకున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఆఫీసర్ల పర్యవేక్షణ లోపంతో సిద్దిపేట జిల్లా అక్బరుపేట-భూంపల్లి మండల పరిధిలోని చిట్టాపూర్-చౌదర్ పల్లి గ్రామస్థులకు అవస్థలు తప్పడం లేదు.బిటి రోడ్డు పనులపై క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్లతో నాణ్యత పరీక్షలు చేయించి కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని రెండు గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఈ రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సీఆర్ఆర్ నిధులతో..

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణలో అప్పటి దుబ్బాక మండలంలోని (ప్రస్తుతం అక్బరుపేట-భూంపల్లి మండలం) చిట్టాపూర్ మెయిన్ రోడ్ (సిద్దిపేట-మెదక్ రహదారి) నుంచి పెద్ద చెరువుకట్ట మీదుగా చౌదర్ పల్లి వరకు సుమారు 2.3 కిలోమీటర్ల దూరానికి రూ.1 కోటి 71 లక్షల 50 వేల (సి ఆర్ ఆర్ నిధుల నుంచి) వ్యయంతో చేపట్టిన బిటి రోడ్డు పనులకు దివంగత దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి చేతుల మీదుగా 2015 డిసెంబర్ 21 న శంకుస్థాపన చేయబడింది.

నిబంధనలకు విరుద్ధంగా..



రోడ్డు పనులు నిబంధనలకు విరుద్ధంగా నాణ్యత లేకుండా నాసిరకంగా చేశారు.కంకర,ఇతర మెటీరియల్ మోతాదుకు తక్కువగా వాడారు.మందపాటిగా వేయాల్సిన బిటి రోడ్డు పలుచగా వేయడంతో కట్టకే అతుక్కుపోయింది.వేసిన నెలకే తారు తేలి గుంతలు ఏర్పడ్డాయి.జిల్లా ఉన్నతాధికారరులు స్పందించి నాణ్యతతో పనులు చేసేలా వెంటనే సదరు కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి.

- పోతనక రాజయ్య,చిట్టాపూర్ సర్పంచ్

తక్కువ మందంతో రోడ్డు

చిట్టాపూర్ నుంచి తమ చౌదర్ పల్లికి చాలా ఏళ్ల కిందట బిటి రోడ్డు మంజూరైంది.అప్పటి నుండి నేటి వరకు కాంట్రాక్టరు పనులు మొదలుపెట్టలేదు.ఇన్నేళ్ల తర్వాత నెలకిందట చేపట్టిన బిటి రోడ్డు పనుల్లో నాణ్యత లోపించింది.కాంక్రీట్ మోతాదు చాలా తక్కువగా వేశారు.అసలు ఇది బీటీ రోడ్డులా లేనేలేదు.జిల్లా అధికారులు కాంట్రాక్టరు పై చర్యలు తీసుకోవాలి.



- కుమ్మరెంకు కుమార్,చౌదర్ పల్లి సర్పంచ్

క్వాలిటీ చెక్ చేశాకే బిల్లు



చిట్టాపూర్-చౌదర్ పల్లి బిటి రోడ్డు పనులు బ్రిడ్జి నిర్మాణం వల్ల ఆలస్యమయ్యాయి. రోడ్డు పనుల్లో భాగంగా 6 ఇంచుల కంకర 2 సార్లు వేయించాం. క్వాలిటీ చెక్ చేశాకే బిల్లు మంజూరు చేస్తాం

- పంచాయతీరాజ్ ఏఈ రిజ్వాన్

కొనుగోలు కేంద్రంలో చేతివాటం?

- బేగంపేట కొనుగోలు కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి
- పని చేయనివారి పేర సీసీ వేతనం తీసుకుందని ఆరోపణలు
- నేటికి వేతనాలందుకోని కొందరు కొనుగోలు కేంద్రాల సిబ్బంది

నవతెలంగాణ-బెజ్జంకి

వానకాలంలో రైతులు పండించిన వరి పంట దిగుబడులకు మద్దతు ధరతో సజావుగా కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మండలంలోని ఆయా గ్రామాల్లో ఐకేపీ ద్వార వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది.ఆరుగాలం శ్రమించిన రైతులకు నష్టం వాటిల్లకుండా ఆయా గ్రామాల్లోని మహిళ ఐక్య సంఘాల సహకారంతో వరిధాన్యం కొనుగోల్ల నిర్వహణ బాధ్యతలు ఐకేపీ సిబ్బంది చేపట్టడం హర్షనీయమైన పనిచేయని సిబ్బంది పేరా పనిచేసినట్లు రికార్డులు నమోదు చేసి అవకతవకలకు పాల్పడం గమనార్హం.గూడెం గ్రామానికి చెందిన డీ.హరీశ్ అనే వ్యక్తి పనిచేసినట్టు రికార్డుల్లో నమోదు చేసి ఆయన పేరునా సుమారు రూ.8500 వేతనంగా సీసీ తీసుకుని చేతివాటం ప్రదర్శించిందనే ఆరోపణలు బేగంపేట వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.కొనుగోలు కేంద్రాల్లో పని చేసిన వారిని సీసీలు బెదిరింపులకు పాల్పడుతూ తీవ్ర ఒత్తిళ్లకు గురిచేసారని సిబ్బంది అవేదన వ్యక్తం చేశారు.మరికొన్ని గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో పనిచేసిన మహిళ సంఘాల సభ్యులు నేటికి వేతనాలు తీసుకోకపోవడం ఆశ్చర్యం.సీసీపై ఆరోపణలకు ఏపీఎం నర్సయ్యను వివరణ కోరడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.ఇకనైనా జిల్లా స్థాయి అధికారులు ఇప్పటివరకు కొనుగోలు కేంద్రంలో బాధ్యతలు నిర్వహించిన సీసీ,సిబ్బంది వివరాలను సేకరించి జరిగిన అవతవకలపై విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

శోభకృత్ ఉగాదికి స్వాగతం

నవతెలంగాణ-తొగుట

వస్తుంది పోతుంది ఉగాది
యెప్పటిలాగే ప్రతి యేడాది
సభలు సమావేశాలు
జరుగుతాయి కవిసమ్మేళనాలు
కోకిల కూసినా...కూయక
పోయినా...

కూస్తాయి కవి కోకిలలు..
చేస్తాయి ఉపన్యాసాలు
చెపుతాయి ధర్మ సందేశాలు
కానీ....వినే వారెవ్వరు..
ఆచరించె వారెవ్వరు...
కవిత్వం చెప్పె కవులు తప్ప...

నవగ్రహాలలో శుభగ్రహాలకు
రాజ్యాధికారం... అంటుంది
పంచాంగం...అంటే...
ఇక అంతమంచే జరుగుతుంద ని
ఆశిద్దామా...

మనలను పాలించే ప్రభువులు
శుభగ్రహాలైతేనేకదా...
ప్రజా శుభిక్షం...

అందలమెక్కిస్తే చాలు అక్రమ
ఆస్తులకు ద్వారాలు తెరుస్తారు
అవనీతికి ఆజ్యం పోస్తారు...
అమ్మా....శోభకృత్ ఉగాది
నీవైన అవుతావా...మంచి
తనానికి...పానాది..

ఆస్తుల కొట్లాటకు అన్నాద
మ్ములు..బలి..
ప్రేమోన్మాదానికి యువత బలి
అక్రమ సంబంధాలకు
ఆలుమగలు ఆహుతి...
అవుతున్నారమ్మ... ఓ ఉగాది
నీవైన మార్చవమ్మ ఓ శోభకృత్
ఉగాది...
మార్చితే ఉంటావు మా
కెప్పుడు...యాది....

- బండకాడి అంజయ్య గౌడ్

తెలుగువారి పండుగ ఉగాది



తెలుగు
సంవత్సరం
ప్రారంభమయ్యే
రోజు ఉగాది
తెలుగువారు
జరుపుకునే మొదటి
పండుగ ఉగాది
ఉగాది
పండగ షడ్రుచుల
పచ్చడి ప్రత్యేకత
సాయంత్రం
వేళ పెద్దలు జరిపే పంచాంగ శ్రవణం
ఉగాది ఉగాది ఎంతో తీయనైన
ఉగాది

- అష్రాఫ్, ఐదో తరగతి, ప్రాథమిక పాఠశాల, గుండారం

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ అందజేత



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ సేకండరి పాఠశాలలో దంత వైద్యశాల డాక్టర్ ప్రణీత్ సహకారంతో ఎఐఎస్బి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ఫ్యాడ్స్ అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పదవ తరగతిలో 100 కు 100 శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాల కు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్బి జిల్లా అధ్యక్షుడు పుల్లని వేణు,ఎం ఈ ఓ మొగుళ్ల నర్సింహారెడ్డి,ప్రధానోపాధ్యాయుడు ఐలయ్య, ఉపాధ్యాయులు ప్రభాకర్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, సుజాత, శైలజ, కనకరాజు ఎఐఎస్బి నాయకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

దళితబంధు సమన్వయ కమిటీ అధ్యక్షుడిగా కరికె శ్రీనివాస్



నవ తెలంగాణ-దుబ్బాక

దుబ్బాక నియోజకవర్గ దళిత బంధు సమన్వయ కమిటీ అధ్యక్షుడిగా కరికె శ్రీనివాస్ ను ఎన్నుకున్నారు.మంగళవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి నియోజకవర్గ వ్యాప్త దళిత ప్రజా ప్రతినిధులు,నాయకులు హాజరైనారు.నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు అమలు,దళిత నాయకులకు నామినేటెడ్ పదవుల్లో వాటా వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.ఉపాధ్యక్షులుగా గుర్రాల శ్రీనివాస్,ర్యాకం శ్రీరాములు,కాల్వ నరేష్,సభ్యులుగా ఆస స్వామి,రాయపోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పుట్ట రాజు,ఇల్లందుల శ్రీనివాస్,ఉషంగాల్ల శ్రీనివాస్, సబంగ యాదగిరి,బండారు దేవేందర్,లింగాల కృష్ణ,చందరాజు ఎర్ర యాదగిరి,చిగురుగళ్ల ప్రభాకర్,కందిరి నవీన్,భూంపల్లి కుమార్ సుమన్,నందు తను ఎన్నుకున్నారని కమిటీ అధ్యక్షుడు కె.శ్రీనివాస్ తెలిపారు. దుబ్బాక, మిరుదొడ్డి, దౌల్తాబాద్, చేగుంట, నార్సింగి, రాయపోల్, తొగుట, అక్బర్ పేట-భూంపల్లి మండలాలకు చెందిన దళిత ప్రజా ప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

కాలయాపన లేకుండా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి

సీపీఎం నాయకులు ఎల్లయ్య



నవ తెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో అర్హులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని, స్థలం ఉన్న వారికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 1,550 మందిని లబ్దిదారులుగా ఎంపిక చేశారని, వారందరికీ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముంపు గ్రామాల కుటుంబాలకు నష్టపరిహారం ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణంలో లబ్దిదారుల ఎంపిక తర్వాత మరల నంబర్లను డ్రా తీయడం సరైన పద్ధతి కాదన్నారు. ఎంపిక చేసినవారందరికీ వెంటనే ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనేక మంది పేర్లు జాబితాలో లేవన్నారు. సర్వే నిర్వహించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

దేవాలయంలో శ్రమదానం.



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ పట్టణంలోని ఉమామహేశ్వర సీతారామ దేవస్థానంలో మంగళవారం పలువురు యువకులు స్వచ్ఛంద సంస్థ నాయకులు శ్రమదానం చేశారు. దేవాలయం చుట్టూ నీటితో శుభ్రం చేశారు. చెత్తాచెదారం పూర్తిగా తొలగించారు. విగ్రహ ప్రతిష్ఠ తర్వాత ఉమామహేశ్వర దేవాలయంలో భక్తుల తాకిడి రోజురోజుకు పెరుగుతుంది. దీని దృష్టిలో పెట్టుకొని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని చేపట్టుతున్నాయి.. ఇంకా ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ ఏ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు నేతి చిన్న సంతోష్, ఎం సి శ్రీనివాస్, దేశ బోయిన నరసింహులు, బాల కుమార్, రమేష్ గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, ప్రభాకర్, సంపత్, నరేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన

నవ తెలంగాణ-దౌల్తాబాద్



దౌల్తాబాద్, దీపాయాంపల్లి, గాజులపల్లి, లింగరాజుపల్లి తదితర గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో మంగళవారం పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా సర్పంచ్ ముత్యంగారి యాదగిరి హాజరయ్యారు. చిరుధాన్యాలు తింటే రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తనయుడు కెంసారం నాగరాజు, వార్డు సభ్యుడు జీర్యపల్లి కుమ్మరి పవన్ కళ్యాణ్, బాలురా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రత్నాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు మహేష్ , గ్రామ పంచాయతీ కార్యదర్శి యాదగిరి , అంగన్వాడీ ఉపాధ్యాయురాలు రమాదేవి , అంగన్వాడి ఆయా అంగన్వాడీ పిల్లల తల్లి తండ్రులు , గర్భిణీ స్త్రీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మనిషికి కంటి చూపు ప్రధానమైనది

జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రాజారెడ్డి



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

ప్రతి మనిషికి కంటి చూపు ప్రధానమైనదని సిద్దిపేట జిల్లా వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి అన్నారు. మంగళవారం హుస్నాబాద్ మండలంలోని నాగారం గ్రామంలో కంటివెలుగు కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, ఎంపీపీ లకవత్ మానస సుభాష్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రజలు కంటిచూపుతో బాధపడవద్దని రాష్ట్ర ప్రభుత్వం కంటి చూపు పై ప్రత్యేకంగా దృష్టి పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల సునీత, ఎంపీటీసీ శ్రీనివాస్, ఉప సర్పంచ్ సంపత్, ఎంపిడిఓ కుమారస్వామి,ఎంపీవో సత్యనారాయణ, కార్యదర్శి రాజమణి, మాజీ సర్పంచ్ బత్తుల శ్రీనివాస్, వార్డు సభ్యులు భాగ్య, శిరీష, కనుకయ్య, పంది రవీందర్ భాషవేని రవీందర్, శ్యామల, నర్మద, ఏఎన్ఎంలు గ్రామస్తులు పాల్గొన్నారు.

కొమువెళ్ళి ఆలయాన్ని దర్శించుకున్న చంద్రారెడ్డి



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలో వ్యవసాయ క్షేత్రం ఉన్న ప్రముఖ వ్యాపార వేత్త ఇనుకొండ చంద్రారెడ్డి,ఆయన కూతురు ఇనకొండ ప్రణీత రెడ్డి లు మంగళవారం కొమురవెళ్ళి మల్లన్న స్వామి వారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించు కున్నారు.అనంతరం ఆలయ అభివృద్ధి కోసం చంద్రారెడ్డి రూ,, ఒక లక్ష పదకొండు వేల విరాళం ఆలయ అకౌంటెంట్ మాధవికి అందజేశారు. దర్శించుకున్న వారిలో బీఆర్ఎస్ బీసీ సెల్ మర్కుక్ మండలాధ్యక్షులు మేకల కనకయ్య ముదిరాజ్, దేవేందర్, తదితరులున్నారు.

అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ మంజీరా రైతు సమైక్య రాష్ట్ర అధ్యక్షులు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతుల పంటల యొక్క నివేదికను వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి పంపి నష్టపరిహారం అందించే విధంగా చూడాలన్నారు. మంగళవారం తెలంగాణ మంజీర రైతు సమైక్య రాష్ట్ర అధ్యక్షులు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ అంకెన్ పల్లి గ్రామానికి చెందిన రమేష్ సుబ్బారావు రైతు యొక్క మొక్కజొన్న, ఉల్లి, క్యాబేజీ, టమాట పంటలు అకాల వర్షం వడగండ్ల వానలకు దెబ్బతిన్న పంటల పరిశీలించారు. ఎకరానికి, కౌలు పెట్టుబడులకు కలిపి 50 వేల నష్టపోయారని తెలిపారు. జిల్లాలో జొన్న బొప్పాయ మామిడి పల్లి పంటలు నష్టపోయారని అన్నారు. వ్యవసాయ అధికారులు గ్రామ గ్రామాన రైతుల యొక్క పంటలను పరిశీలించి పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 30 వేల పంట నష్టాన్ని ప్రభుత్వం అందించే రైతులను ఆదుకోవాలని సమైక్య ద్వారా డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతులను నష్టపోయిన పంటలు వివరాలను వ్యవసాయ అధికారులకు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, హుస్సేన్, బసవరాజ్, శ్రీశైలం, బసవరాజ్, రాజు, సంగన్న తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో నాలుగు రెవెన్యూ విలేజ్‌లు

నవ తెలంగాణ హుస్నాబాద్ రూరల్



అక్కన్నపేట మండలంలోని నాలుగు రెవెన్యూ విలేజ్‌లను హుస్నాబాద్ మండలంలో కలపడాన్ని హర్షిస్తూ మంగళవారం హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గోవర్ధనగిరి, రేగొండ, మల్ చెరువు, బోడిగెపల్లి, జనగామ, గుబ్బడి, కేశవపూర్, మంచినీళ్ల బండ గ్రామాలను హుస్నాబాద్‌లో కలవడంపై సర్పంచ్‌లు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. హుస్నాబాద్ ఎంపీపీ మానస,బి అర్ ఎస్ మండల అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, కసర్ల అశోక్ బాబు, పెండ్యాల ఐలయ్య,పొన్న బోయిన శ్రీనివాస్, సర్పంచ్ లు బొమ్మగని రాజేశం,ఇటికాల కవిత కుమార్, కత్తుల మానస,గూళ్ల రజిత , పిసర సునీత రాములు,కాశావెని సంపత్, భూక్యా మల్లేష్, మూల నిర్మల సూర్య రెడ్డి, భైరగొని శ్రీను, భైరి రవి, కత్తుల శంకర్, రాజయ్య, యామా శంకరయ్యా, పర్శరాములు, కుమార్, వేణుగోపాల్ రావు,ఎడల వనేష్ పాల్గొన్నారు.

అక్కన్నపేటలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలంలో ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించాలని, మండల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతూ తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు తోందురు ఎల్లయ్య చేస్తున్న రిలే నిరాహార దీక్ష మంగళవారానికి 9వ రోజుకు చేరుకుంది. తెలంగాణ ప్రభుత్వం అక్కన్నపేట మండలాన్ని నిర్వీర్యం చేసే విధంగా మేజర్ గ్రామాలను వేరే మండలాల్లో కలపడం బాధాకరమని తెలిపారు. మండలం ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలు లేక అరకొర వసతులతో అద్దె భవనాలలో కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండల అభివృద్ధిపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఇది ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో మండల అభివృద్ధికై ఆమరణ నిరాహార దీక్ష చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలంగాణ అంబెడ్కర్ సంఘం రాష్ట్ర నాయకులు ఎల్లయ్య పేర్కొన్నారు. మిట్టపల్లి వెంకటయ్య, కనకయ్య, మాధవరెడ్డి,గజ్జల్లి గంగయ్య మద్దతు తెలిపారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవ తెలంగాణ - సిద్దిపేట



కంటి వెలుగు కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల అన్నారు. 41వ వార్డులో కొనసాగుతున్న కంటి వెలుగును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలందరికీ ఉచితంగా వైద్య సేవలను అందిస్తుందని, ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సాయన్న గారి సుందర్, నాయకులు లిఖిత్ పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై రైతు శిక్షణా కార్యక్రమం



నవతెలంగాణ-సంగారెడ్డి

ఉద్యానశాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఫల పరిశోధన కేంద్రంలో 'ఉద్యాన పంటలపై వాతావరణ మార్పుల ప్రభావం ..తీసుకోవాల్సిన చర్యలు' అంశంపై మంగళవారం రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ముందు జాగ్రత్తగా షేడ్ నెట్స్ ఏర్పాటు చేసుకోవటం, పూతరాలకుండా నివారణకు ప్లానో ఫిక్స్ తగిన మోతాదులో వాడటం వంటి చర్యలను సూచించారు. అధిక ఉష్ణోగ్రతలతో ఉల్లిగడ్డ పరిమాణం తగ్గటం, పండ్లలో రుచి తగ్గడం, అధిక వర్షాలు, గాలులకు రాలిన కాయలతో చేయాల్సిన విలువ ఆధారిత ఉత్పత్తులు, కూరగాయలు టమాట, మునగ, అల్లం వంటి వాటితో ప్రాసెసింగ్ ద్వారా విలువ ఆధారిత, ఉత్పత్తులు మరియు అరటి, ఆలుగడ్డ ద్వారా చిప్స్, ఉసిరి, ఎండు ద్రాక్ష వంటి ఉత్పత్తులు, జ్యూస్ మరియు క్వాష్ ప్రోడక్ట్స్ గురించి శాస్త్రవేత్తలు వివరించారు. గ్రేడింగ్, సార్టింగ్, మార్కెటింగ్ విధానాలు ఎగుమతులకు సంబంధించిన పద్ధతులను సూచించారు. కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం కృష్ణ తేజ, ఎఫ్ఆర్ఎస్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ వి. సుచిత్ర, శాస్త్రవేత్తలు హరికాంత్, నితీష్, మౌనిక, సిప్షేఆర్ఐ శాస్త్రవేత్త డాక్టర్ జ్యోతిర్మయి, అగ్రి ఎంటర్ పెన్యూర్ నాగరాజు, జిల్లా ఉద్యాన అధికారి పి.సునీత, ఉద్యాన సహాయ సంచాలకులు సత్తార్, మండల ఉద్యాన అధికారులు, రైతులు పాల్గొన్నారు.

6వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ పర్యటన



నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డ్ బాలజీనగర్‌లో బొల్లారం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కొలన్ రోజా బాల్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. అక్కడ గల సమస్యలను వార్డ్ కౌన్సిలర్‌తో కలిసి కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా డ్రయినేజీ సమస్య లోకల్ వాటర్, మంజీర నీటి సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాజేందర్ కుమార్, వార్డ్ కౌన్సిలర్ గుండ్ల సుజాత మహేందర్ రెడ్డి, నాయకులు గుండ్ల మహేందర్ రెడ్డి ,ఇన్వోల్ మెంట్ ఇంజనీర్ సాయి కిరణ్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రశాంత్, మెప్మా పర్సన్ కవిత మరియు మున్సిపాలిటీ సిబ్బంది మరియు స్థానికులు పాల్గొన్నారు.

రోడ్లపై జెండాలు పెట్టిన వ్యక్తులపై కేసు



నవతెలంగాణ-న్యాల్‌కల్

గంగ్వార్ చౌరస్తాలో మెటల్కుంట గ్రామానికి వెళ్లే రోడ్డులో డివైడర్ పై శివాజీ మహారాజ్ జెండా పెట్టిన గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసి పరిశీలిన చేస్తున్నట్టు హద్నూర్ పోలీసులు తెలిపారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దుర్గయ్య, హద్నూర్ పోలీసులు, గ్రామ సహాయకులు ఆ జెండా ను తొలగించారు. ప్రభుత్వ రోడ్డులో ఇలాంటి జెండాలు పెడితే కఠిన చర్యలు తప్పవని మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ దుర్గయ్య హెచ్చరించారు.

ఘనంగా స్వయంపాలనా దినోత్సవం



నవతెలంగాణ-వట్‌పల్లి

మండలంలోని బూత్కూరు ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం స్వయం పాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐదో తరగతి విద్యార్థుల ఆటా పాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. కలెక్టర్‌గా పెద్దగుల్ల మహేశ్వరి, జిల్లా విద్యాశాఖ అధికారిగా బీరప్ప, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా దాదాయిపల్లి లక్ష్మీ, ఇతర విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అనంతరం రెగ్యులర్ ఉపాధ్యాయులైన లక్ష్మణ్‌ను. ఉపాధ్యాయురాలు చరణను గ్రామ పెద్దలు శాలువాలతో సన్మానించారు. గ్రామ పెద్దలు, ఉమ్మడి రేగోడు మండల్ మాజీ జెడ్పిటిసి పాపయ్య, బుచ్చయ్య, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అంతారం పాఠశాల విద్యార్థులకు షూ పంపిణీ



నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని అంతారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ఉప్పరి శివ ప్రసాద్ షూస్‌ను పంపిణీ చేశారు. సర్పంచ్ ఎడ్ల శంకర్ చేతుల మీదుగా మంగళవారం షూను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు దాతలు సహకారం అందించడం అభినందనీయమన్నారు. దాతలు ముందుకు రావాలని, పేద మధ్యతరగతి విద్యార్థులను ఆదుకొని వారిలో మనోధైర్యాన్ని నింపాలని ప్రధానోపాధ్యాయులు బాల్‌రాజ్ కోరారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, దాత శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిద్దాం



నవతెలంగాణ-సదాశివపేట

కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న మతోన్మాద, కార్పొరేట్ విధానాలను వ్యతిరేకించాలని సీపీఐ(ఎం) సదాశివపేట కార్యదర్శి ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ ఆఫీస్‌లో మంగళవారం సీపీఐ(ఎం) జన చైతన్య యాత్ర వాల్ పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. ఈనెల 24న నిజామాబాద్‌లో ప్రారంభమయ్యే జన చైతన్య బస్సుయాత్ర 25న సంగారెడ్డికి, 26న ఉదయం సదాశివపేటకు వస్తుందన్నారు. బీజేపి కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్ కంపెనీలకు లక్షల కోట్లు కట్టబెడుతూ ప్రజలపై భారాలు మోపుతూ 23 కోట్ల మందిని పేదలను చేసిందన్నారు. దేశమంటే అంబానీ ఆదానీల సొత్తుగా మార్చేశారన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనాలు ప్రచురిస్తే తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యం లేకుండా నియంత పరిపాలన కొనసాగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలను చైతన్యవంతం చేయడానికి సీపీఐ(ఎం) జన చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నారు. ఈ యాత్రల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రమేష్‌గౌడ్, అనిల్,మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ అప్పారి వెంకటస్వామికి ఘన నివాళి



నవతెలంగాణ-సంగారెడ్డి

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ అప్పారి వెంకటస్వామి 22వ వర్ధంతి కార్యక్రమాన్ని యూటీఎఫ్ కార్యాలయం సంగారెడ్డిలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సాయిలు పాల్గొని మాట్లాడుతూ.. అప్పారి వెంకటస్వామి త్యాగనిరతిని, పోరాట పటిమ ఉపాధ్యాయ ఉద్యమానికి ఎంతో అవసరమని, వారి ఆశయాల సాధన కోసం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసుకోవడం కోసం టిఎస్ యుటిఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని, అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానం 20-20 ని రద్దుచేసి ప్రత్యామ్నాయ విధానం తీసుకురావాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు వెంటనే క్లియర్ చేయాలని కోరారు. టీఎస్ యుటిఎఫ్ జిల్లా కోశాధికారి పి. శ్రీనివాసరావు జిల్లా కార్యదర్శి బి. సాయితేజ నాయకులు వెంకయ్య జి. ప్రభాకర్, జగన్మోహన్, ఎం. జ్యోతి, దేవేందర్, శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరిపంటలో అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన



నవతెలంగాణ-హత్నూర

మండలంలోని చీక్‌మద్దూరు గ్రామంలో గల వరి పంట క్షేత్రాలను సహాయ వ్యవసాయ సంచాలకులు ఏడిఏ అరుణ సందర్శించి అగ్గి తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కాలానికి అనుకూలంగా అగ్గి తెగుళ్లు సోకే అవకాశం ఉన్నందున.. రైతులు అప్రమత్తంగా ఉండి వ్యవసాయ అధికారుల సలహా సూచన మేరకు పంటను కాపాడుకోవాలని సూచించారు. మెడ విరుపు తెగుళ్లు సోకితే.. వరిపంట గోల వంకర తిరిగి నల్లగా మారే అవకాశం ఉందన్నారు. దీనివల్ల దిగుబడి తగ్గి తాలు ఎక్కువ వచ్చే అవకాశం ఉందని.. అందుకు రైతులు తెగులును గమనించిన వెంటనే ట్రై సైక్లజోల్ 0.6 గ్రామ్స్ లీటర్ నీటి లో కలిపి పిచికారి చేయాలని దీనివల్ల తెగుళ్ళ నిర్మూలించుకోవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఏఈవో స్రవంతి, రైతులు నాగేష్, రాములు, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు బైరాన్‌పల్లి 'డబుల్' ఇండ్లు

- అర్హులకు కేటాయించాలని యూత్ ఆధ్వర్యంలో సర్పంచ్‌కు వినతి



నవతెలంగాణ-మద్దూరు

దూళ్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లిలో చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తై అయిదేండ్లు గడుస్తున్నా నేటికీ పంపిణీ చేయకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్నాయని.. వెంటనే అర్హులను గుర్తించి అందజేయాలని గ్రామ యూత్ ఆధ్వర్యంలో సర్పంచ్ బండి శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మందు బాబులకు ఈ ఇండ్లు అడ్డాగా మారాయని.. అక్కడ విచ్చలవిడిగా మద్యం సేవించడంతోపాటు సీసాలను కూడా పగులగొడుతున్నారని యూత్ సభ్యులు పేర్కొన్నారు. అంతేకాకుండా అసాంఘిక కార్యకలాపాలు కూడా జరుగుతున్నాయన్నారు. కాబట్టి వెంటనే సర్పంచ్ చొరవ తీసుకుని డబుల్ ఇండ్ల పంపిణీ చేపట్టాలన్నారు. లేనియెడల గ్రామస్తులతో కలిసి అసలైన లబ్దిదారులను ఎంపిక చేసి వారితో గృహ ప్రవేశాలు చేయిస్తామని వినతిపత్రంలో పేర్కొన్నారు.

పండ్ల తోటలకు ఎరువుల సబ్సిడీపై డీలర్లకు అవగాహన



నవతెలంగాణ-వట్‌పల్లి

పండ్ల తోటల పెంపకానికి అవసరమయ్యే ఎరువుల సరఫరా.. వాటి వినియోగంపై డీలర్లు అవగాహన కలిగి ఉండాలని ఆత్మ డిపార్ట్మెంట్ శాస్త్రవేత్త గులాం తెలిపారు. మండలంలోని మేడికుంద శివారులో రైతు రామచందర్ పాలిహౌజ్‌లో ఆత్మ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండ్ల తోటల పెంపకానికి భూసారాన్ని పెంచేందుకు సేంద్రియ ఎరువులను, పశువుల పేడను తడి, పొడి చెత్తతో తయారుచేసిన ఎరువులను వినియోగించాలన్నారు. దీంతో పండ్ల తోటల పెంపకం ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రమేష్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.



దృష్టిలోపాలను తొలగించేందుకే కంటి వెలుగు

నవతెలంగాణ-ఝరాసంగం

దృష్టి లోపాలను తొలగించేందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందని బీఆర్ఎస్ యువ నాయకులు రాజ్ కుమార్, ఉపసర్పంచ్ మాణిక్ యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ప్యారవరం గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంధత్వ రహిత రాష్ట్రంగా తెలంగాణను మార్చేందుకు తలపెట్టిన ఈ అద్భుతమైన కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యదర్శి రాజ్ కుమార్, వైద్య సిబ్బంది మార్త, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కేతకిలో భక్తుల సందడి

నవతెలంగాణ-ఝరాసంగం

సంగారెడ్డి జిల్లాలోనే శైవ క్షేత్రాల్లో అతి పురాతనమైన దేవాలయం శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయం దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందింది. మంగళవారం అమావాస్య కావడంతో ఆలయ ప్రాంగణమంతా సందడిగా నెలకొంది. కర్ణాటక, మహారాష్ట్ర, తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ గోపురానికి కొద్ది దూరంలోనే శివపాంస్తుల విగ్రహాలు ఉన్నాయి. భక్తులు ఆలయంలోకి ప్రవేశించాలంటే విగ్రహం ముందు నుంచి రావాల్సి ఉంటుంది. ఈ దారికి అడ్డంగా వాహనాలను విచ్చలవిడిగా పార్కింగ్ చేయడంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తాయి. అయిన అక్కడే పక్కనే ఉన్న ఆలయ కార్యనిర్వహణ అధికారులు తమకు ఏమి పట్టనట్టు వ్యవహరించారు. ఆలయానికి ఫుల్‌ఛార్జ్ ఇవో లేకపోవడమే కారణమని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.



జాతీయ జెండా స్తూపం నిర్మాణానికి అనుమతి ఇవ్వండి

నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

జాతీయ జెండా స్తూపం నిర్మాణం కోసం అనుమతి ఇవ్వాలని ఆరో వార్డు కౌన్సిలర్ గుండ్ల సుజాత మహేందర్ రెడ్డి మున్సిపల్ కమిషనర్‌కి మంగళవారం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటి వరకు ఆధ్యాత్మిక స్తూపాలు, ప్రతిష్ఠాత్మకమైన సుందరీకరణ స్తూపాలు గాని, కళాత్మక, జాతీయ స్తూపాలు నిర్మించలేదన్నారు. వాటి స్థాపనకు ఎటువంటి చర్యలు తీసుకున్నారో కూడా తెలియదని.. కావున తమ వార్డులో తమ సొంత నిధులతో ఏర్పాటు చేసుకొనున్న జాతీయ జెండా స్తూపం నిర్మాణం కోసం అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేత గుండ్ల మహేందర్ రెడ్డి, ఆరోవార్డు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చందాపూర్ యూపీఎస్ పాఠశాలలో ఉగాది సంబ రాలు.



నవతెలంగాణ-తొగుట

విద్యార్థిని, విద్యార్థులకు తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ విశిష్టతను తెలియజేయడం ఎంతో గొప్ప విషయమని సర్పంచ్ బొడ్డు నర్సింలు అన్నారు. మంగళవారం మండలంలోని చందాపూర్ యూపీఎస్ పాఠశాలలో శోభకృత్ నామ ఉగాది పండుగ సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, ఉగాది పండుగ విశిష్టతను, ఉగాది పచ్చడి తయారుచేసే విధానం విద్యార్థులకు తెలిపారు. బాల కవిసమ్మేళనం నిర్వహించి, కవితా పఠనం చేసిన బాలకవులను, సుగుణ సాహితీ సమితి వారు నిర్వహించిన కథల పోటీలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి సాధించిన అధిత్య వర్ధన్‌ను సర్పంచ్ బొడ్డు నర్సింలు, ప్రధానోపాధ్యాయులు గరిపల్లి సిద్దేశ్వర్‌లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సహోపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మనోవికాస కేంద్రానికి టాబ్, నిత్యావసర సరుకుల పంపిణీ



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలో లయన్స్ క్లబ్ భవనంలో సహాయ సహకారాలతో కొనసాగుతున్న అభయజ్యోతి మనోవికాస కేంద్రంలోని విద్యార్థులకు 15వ వార్డుకు చెందిన నాయిని ప్రతాప్ రెడ్డి, కూరెల్లి సుష్మల సహకారంతో రూ.18 వేల విలువైన టాబ్‌తో పాటు, పిల్లల కోసం సుమారు రూ.2 వేల నిత్యావసర సరుకులను సంస్థ నిర్వహకులు జోజికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మానసిక బాధితులకు అభయజ్యోతి అండగా ఉండటం అభినందనీయమన్నారు. సంపాదించిన దానిలో కొంతైనా సేవా కార్యక్రమాలకు ఉపయోగించటం ద్వారా జీవితానికి సంతృప్తి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దమ్మ కమలాకర్ రెడ్డి, జక్కుల రాజ శేఖర్, నాయిని మధుసూదన్ రెడ్డి, రహ్మత్, గూడ అమరెందర్ రెడ్డి, నాయిని సంజీవరెడ్డి, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గీతా స్కూల్లో ఘనంగా ఉగాది వేడుకలు



నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

షడ్రుచుల తెలుగు సాంప్రదాయానికి ఆకుపచ్చని చీర కట్టి పుడమికి హరతిచ్చినట్టు శోభాకృత్ నామ తెలుగు సంవత్సరాధి ఉగాది వేడుకలను తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని గీతా స్కూల్లో విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ప్రతి మనస్సు మావిచిగురులా అల్లుకుంటే ప్రతి చిగురు చిరునవ్వులా పూస్తుంటే మదిమది పులకించిన వేళ అందరి కళ్ళల్లో ఆనందహేల ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గీతా స్కూల్లో ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అచ్చ తెలుగు సాంప్రదాయ దుస్తుల్లో నూతన ఉగాదికి స్వాగతం పలికి విద్యార్థులు షడ్రుచుల పచ్చడిని తయారు చేసి ఉపాధ్యాయులతో కలిసి సేవించారు. తెలుగు ఉపాధ్యాయులు భిక్షపతి, స్వామి ఉగాది విశిష్టతను తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి. రామాంజనేయులు, చైర్‌పర్సన్ పి. ఉష, యున్సిపల్ చైర్మన్, పాఠశాల డైరెక్టర్ బి. రాఘవెందర్‌గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్, డైరెక్టర్ కొడిప్యాక నారాయణగుప్త, పాఠశాల ప్రిన్సిపల్ వెంకట కృష్ణారావ్, ఇంచార్జ్ ప్రిన్సిపల్ ప్రేంరాజ్, ఉపాధ్యాయులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా తెలుగు సంవత్సరాది ఉగాది కవి సమ్మేళనం



నవతెలంగాణ-చేర్యాల

తెలుగువారి తొలి పండుగ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శోభ కృత్ నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనం, ప్రపంచ కవితా దినోత్సవాన్ని చేర్యాల రచయితల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం చేర్యాల పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది వైశిష్ట్యాన్ని, ప్రకృతి ప్రసాదించిన వనరులను కాపాడుకుంటూ మనిషి తన మానవతను చాటుకునేలా సాటివారికి సహకరించేలా కన్న తల్లిదండ్రులను పర్యావరణాన్ని మానవతను పచ్చదనాన్ని కాపాడుకుంటే ప్రతిరోజు పండగే అని కవులు తమ కవితా రచన గానం చేశారు. ఈ కార్యక్రమంలో చేర్యాల రచయితల సంఘం అధ్యక్షుడు మంగళగిరి రామచంద్ర మూర్తి, పద్మలత, పాశి కంటి వెంకటరమణ, తౌట రామాంజనేయులు, ఎలికట్టె ఐలయ్య, ఉప్పల ప్రభాకర్, గుళ్లపల్లి తిరుమల కాంతి కృష్ణ, అంబటి అంజయ్య, పాశి కంటి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలి

ఎంపీపీ వెంకట నర్సింగ్ రావు



నవ తెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని గ్రామ గ్రామాన బాలల సంరక్షణ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని ఎంపీపీ వెంకట నర్సింగ్ రావు అన్నారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని ఎంపీపీ చాంబర్లో బాలల సంరక్షణ పేరట రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకట నర్సింగరావు మాట్లాడుతూ గ్రామాలలో ఎంపిక చేసిన బాలల సంరక్షణ కమిటీలు గ్రామాలలో బాల్యవివాహాలు జరగకుండా అక్రమ దత్తతలు తీసుకోకుండా. బాల కార్మికులు లేకుండా చూడాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. పిల్లలపై వేధింపులు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ హేమ భార్గవి. ఎంపీడీవో మార్టిన్ లూథర్. మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్. ఎస్సై శివకుమార్. సర్పంచుల పోరం అధ్యక్షులు జితేందర్ రెడ్డి.. ఐసిడిఎస్ సూపర్వైజర్ సరళ కుమారి. అనిత. మండల విద్యాధికారి బుచ్చ నాయక్ తదితరులు ఉన్నారు..

అగ్గి తెగులు నివారణపై రైతులకు అవగాహన



నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

వరి పంటలో వచ్చే అగ్గి తెగులు నివారణలో రైతులు పూర్తి అవగాహనతో ఉండాలని తూప్రాన్ మండల ఏఈవో సంతోష్ రైతులకు సూచించారు. మంగళవారం తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని అల్లాపూర్ గ్రామంలో రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడుతూ ప్రస్తుత దశలో వరి పంటకు అగ్గి తెగులు సోకి అధికంగా నష్టాన్ని కలిగిస్తున్నట్టు తెలిపారు. వరి పైరు చిరుపొట్ట దశలో అగ్గి తెగులు లక్షణాలను గమనించినట్లయితే ఆఖరి దఫా యూరియా కొన్ని రోజులు తాత్కాలికంగా ఆపాలన్నారు. మొక్కలలో రోగ నిరోధక శక్తిని పెంచడానికి పొటాష్ ఎరువును ఎకరాలకు 15 నుండి ఇరవై కిలోల వరకు వేయాలని తెలిపారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు మరియు మ్యాన్కోజబ్ 0.25 లేదా ఐసోప్రోథాయోలెన్ 1.5 ఎంఎల్ లేదా కాసుగమైసిన్ 2.5 ఎంఎల్ ఒక లీటర్ నీటికి చొప్పున కలుపుకుని ఉధృతిని బట్టి పిచికారి చేయాలని సూచించారు.

నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ అండ

జడ్‌పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్

21ఎంఎస్‌బి07



నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్) : కార్పోరేట్ ఆసుపత్రులలో వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడే ప్రతి నిరుపేదకు సీఎంఆర్‌ఎఫ్ ఒక వరంలాంటిదని జడ్‌పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మనోహరాబాద్ మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెల్దుర్తి మండలం నెల్లురు గ్రామానికి చెందిన భిక్షపతిగౌడ్‌కు మంజూరైన 25 వేల రూపాయల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎవరైనా కార్పోరేట్ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారు రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ ఆసుపత్రులను కార్పోరేట్ ఆసుపత్రులకు ధీటుగా తయారు చేయడమే కాకుండా మంచి వైద్యాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణగౌడ్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ





నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

విద్యార్థులు పదవ తరగతిలో కష్టపడి చదివి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతతో పాటు ఉన్నత స్థానాలను సాధించాలని జీఎంఆర్ పోచంపల్లి ఎక్స్‌ప్రెస్ వేస్ లిమిటెడ్ ప్రాజెక్టు మేనేజర్ వెంకటరమణ సూచించారు. తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ పాఠశాలలో జీఎంఆర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షల సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు తొలిమెట్టు లాంటిదని ప్రతి ఒక్క విద్యార్థి శ్రద్ధతో చదివి మంచి ఉత్తీర్ణతను సాధించాలని తెలిపారు. రాబోయే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలని ఆశిస్తూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ ఆర్‌పీ భట్నాగర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవి మంచి ఫలితాలను సాధించి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరును తీసుకురావాలని సూచించారు. దేశం నలుమూలల ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న గ్రంధి మల్లికార్జున్‌రావ్ లాంటి మహోన్నత వ్యక్తిని ఆదర్శంగా తీసుకుని నేటి విద్యార్థులు సమాజాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 500 మంది పదవ తరగతి విద్యార్థులకు జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్షల సామాగ్రిని పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ సంస్థ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

చేగుంట వెల్దుర్తి పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కనెక్టివిటీ



నవతెలంగాణ-వెల్దుర్తి

చేగుంట, వెల్దుర్తి పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కనెక్టివిటి కార్యక్రమాన్ని చేపట్టారు. స్టేషన్ పరిధిలో గల మాసాయిపేట చేగుంట పోలీసులు ఎస్సై రామయంపేట సిఐ పరిధిలో ఉన్న ఎస్ఐలు వెల్దుర్తి మండల పరిధిలో కొప్పులపల్లి గ్రామంలో కమ్యూనిటీ కనెక్టివిటీ సమాజంతో అనుసంధానం అనే కార్యక్రమాన్ని మంగళవారం తూప్రాన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ శివంపేట ఎస్సై రవి కాంతారావు వెల్దుర్తి ఎస్ఐ మధుసూదన్ గౌడ్ ఏఎస్ఐ హెడ్ కానిస్టేబుల్ కానిస్టేబుల్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కనెక్టివిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తూప్రాన్ డిఎస్పి హాజరై మాట్లాడారు యువకులకు చెడు వ్యసనాలకు లోను కాకుండా సమాజంలో ఎలా బ్రతకాల్లో తగు సూచనలు సలహాలు చేశారు. రోడ్డు ప్రమాదాలు చెడు అలవాట్లను సైబర్ నేరాల బారిన పడకుండా ఎలా ఉండాలనే విషయాలపై తగు సూచనల ఇచ్చారు. పోలీసులు సమాజంతో ఎలా అనుసంధానంగా ఉంటున్నారనే విషయాలపై క్షుణ్ణంగా వివరించారు కమ్యూనిటీ నెగిటివిటీలో భాగంగా సరైన పత్రాలు లేని 11 ద్విచక్ర వాహనాలను రెండు ఆటోలను స్వాధీనం చేసుకొని సీజ్ చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా పాత గ్రామపంచాయతీ భవనం ముందు గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామంలో అభివృద్ధి చెందాలంటే పోలీసుల సేవలను పోలీసు అవసరాలను ఎలా వినియోగించుకోవాలనే విషయాలను వివరించారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బాల్‌రెడ్డి కిషన్ గౌడ్ గ్రామస్తులు ఉన్నారు.

సగటు మనిషి ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి

ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి



నవతెలంగాణ-మర్కుక్

సగటు మనిషి ఆరోగ్యమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్.వంటేరు యాదవ రెడ్డి అన్నారు. మంగళవారం మర్కుక్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మర్కుక్ ఎంపీపీ తాండ పాండు గౌడ్, జెడ్పీటీసీ యెంబరి మంగమ్మ రామచంద్రం యాదవ్, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మర్కుక్ కర్ణాకర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ భాస్కర్‌లతో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వంద శాతం అంధత్వ నివారణే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారని, గ్రామీణ పట్టణ ప్రాంతాలలోని 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగుతో పేద ప్రజలకు లబ్ధి చేకూరుతుందని గ్రామంలో దృష్టిలోపం ఉన్న ప్రతి ఒక్కరు కంటి వెలుగు శిబిరాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు . ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్, వైద్యులు డాక్టర్ అశాజ్యోతి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శశి శ్రీ, డిఈవో గణేష్, అప్తామలిస్ట్ భరత్, ఎంపీటీసీ చైతన్య శంకర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకట నర్సింహ్మారెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్ సంతోష్ రెడ్డి, వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రవీణ్ చారి, రెడ్డి సంఘం మండలాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, వార్డు సభ్యులు కిషోర్, బాపురెడ్డి, గ్రామ బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు అజయ్ రెడ్డి, సిసి కవిత, వివోఏలు కావ్య, కవిత, మండల యూత్ నాయకులు సాయిని మహేష్, పాపొల్ల రాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి మౌన, ఆరోగ్య సిబ్బంది ఎండి షేకిల్,సు నిల్, గణేష్, ఏఎన్ఎంలు స్వప్న, ఆశా వర్కర్లు రాణి, లక్ష్మీ లక్ష్మీ బాయి, హరిక, కవిత, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు తదితరులున్నారు.

రైతుల రుణమాఫీ ఎక్కడ చేశారు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గంలో రైతుల రుణమాఫీ ఎక్కడ చేశారని అసెంబ్లీ కో కన్వీనర్ బండారి మహెష్, గజ్వేల్ మండల అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్‌లు ప్రశ్నించారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత కొన్ని రోజుల నుంచి మండలంలోని గ్రామలలోకి బ్యాంకు అధికారులు వెళ్లి గ్రామ పంచాయతీ దగ్గరకు రైతులకు సంబంధించిన రుణాలు జాబితాను అంటించి వెంటనే చెల్లించాలని బ్యాంక్ అధికారులు డిమాండ్ చేస్తున్నారని వారు చెప్పారు. స్థానిక సర్పంచ్‌ను పిలిపించుకొని ఊరిలో బ్యాంకులో రైతులు రుణం తీసుకున్నారని వెంటనే చెల్లించాలని సర్పంచ్ బాధ్యత తీసుకొని వసూలుకు సహకరించాలని బ్యాంక్ అధికారులు ఒత్తిడి తీసుకొస్తున్నారన్నారు. లీస్టును గ్రామ పంచాయతీ వారికి ఇచ్చి డబ్బులు ఖచ్చితంగా కట్టాలని డిమాండ్ చేస్తున్నారని వారు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ రుణమాఫీ చేస్తామని హామీ ఇవ్వడంతోనే రైతులు బ్యాంకులో రుణాలు తీసుకున్నారన్నారు. వెంటనే రుణమాఫీ చేయాలని వారు డిమాండ్ చేశారు. 2014, 2018 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి వాంజరి రాజు, కిసాన్ మోర్చ మండల అధ్యక్షులు పంజా బాలయ్య , బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఇప్ప స్వామి, మండల నాయకులు కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కంటి సమస్యలు పరిష్కరించేందుకు కంటి వెలుగు శిబిరం



నవతెలంగాణ-తొగుట

ప్రజల కంటి సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేసిందని సర్పంచ్ తోయేటి ఎల్లయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య, పిఏసీఎస్ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణ రెడ్డి, వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డిలు తెలిపారు. మంగళవారం మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో కంటి వెలుగు 2 శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కంటి సమస్యలు పరిష్కరించేందుకు కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేసిందన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేసుకొని ప్రభుత్వం అందించే కంటి అద్దాలు, మందులను తీసుకోవాలని సూచించారు. సీఎం కేసీఆర్ ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ఎంతో కృషి చేస్తున్నారని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు వైద్య సిబ్బందికి సహకరించి కంటి వెలుగు శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్, వైద్య అధికారి డాక్టర్ రాధకిషన్,హెల్త్ సూపర్‌వైజర్ శ్యామల, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, కంటి శిబిరం వైద్య అధికారి కిరణ్ కుమారి, అప్తో మెట్రిస్ట్ పి.సాయి, డాటా ఎంట్రీ ఆపరేటర్ యెస్.జ్యోతి, ఏఎన్ఎం సిహెచ్.స్వప్న ఆశా కార్య కర్తలు పి.జ్యోతి, డి.లక్ష్మి, బి.నవీన,ఏ.స్వరూప, ఈ.శ్వేతా, పి.బాల్ లక్ష్మీ, గ్రామ ప్రజలు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి. ఐకెపి ఎపీఎం



నవతెలంగాణ-చేగుంట

పొదుపు సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, అన్ని రంగాలలో రాణించాలని, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఐకెపి(సర్ఫ్) ఎపీఎం లక్ష్మి నరసమ్మ పేర్కొన్నారు. చేగుంట మండలం చందాయిపేట గ్రామంలో ఐకెపి మహిళ పొదుపు సంఘాల గ్రూపులకు, మంగళవారం పావలా వడ్డీ రుణాల చెక్కులను స్థానిక సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్‌లతో కలిసి 39 సంఘాలకు పావులా వడ్డీరుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ పరిధిలో మహిళ పొదుపు సంఘాలు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకొని, చిన్న చిన్న పరిశ్రమలు నెలకొల్పాలని, వాటి ద్వారా ఆదాయాన్ని పొందాలని, అలాగే తీసుకున్నా రుణాలు బ్యాంకులకు సకాలంలో చెల్లించాలని తెలిపారు. సర్పంచ్ స్వర్ణలత మాట్లాడుతూ గ్రామంలో 39 సంఘాలకు వడ్డీ లేని రుణాలు, రూ.13,02,586ల చెక్కులను ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంతోష్ కుమార్, వార్డ్ మెంబర్ రమ్య రవి, సీసీ అంజయ్య, సిఏలు ఏ. స్వామి, అచ్చంపేటపద్మ బోనాలజ్యోతి వివోలీడర్లు సంతోష,వీరమని,సుమలత, బాలమణి, భాను, నాగమణి, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-పెద్దశంకరంపేట:

మండలంలో ఈ నెల 23న నిర్వహించే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఆసూరి మురళీపంతులు అన్నారు. మంగళవారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, జడ్పీటీసీ విజయరామరాజులతో పాటు మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు ప్రజా ప్రతినిధులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశానికి హజరై మాట్లాడారు. ఈ నెల 23న జరగబోయే ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇంచార్జి ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశంతో పాటు ఎమ్మెల్యేలు ఎం.భూపాల్‌రెడ్డి, పద్మా దేవేందర్రెడ్డిలు హజరవుతున్నారన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే దిశగా ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఆత్మీయ సమ్మేళనాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఉపయోగపడుతాయన్నారు. ఈ సమ్మేళనానికి పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు హజరై విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొన్నారు

ప్రశాంతంగా పది పరీక్షలు రాసుకోవాలి



నవతెలంగాణ-టేక్మాల్

ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు రాసుకోవాలని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు సంగమేశ్వర్ గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కుసంగి గ్రామంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పెన్నులు అందజేసిన అనంతరం ఆయన వారి ఉద్దేశించి మాట్లాడారు. పదవ తరగతి వార్షిక పరీక్షల్లో ప్రతి ఒక్క విద్యార్థి ఆందోళనకు గురి కాకుండా ,ప్రశాంతంగా పరీక్షలు రాసి మొదటి తరగతిలో ఉత్తీర్ణత సాధించాలని టేక్మాల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సంగమేశ్వర్ గౌడ్, కుసంగి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్ రాథోడ్,మాజీ సర్పంచ్ మొగుల్ రెడ్డి అన్నారు. మంగళవారం టేక్మాల్ మండల పరిధిలోని కుసంగి గ్రామ చైతన్య యూత్ అధ్యక్షులు సంగమేశ్వర్ గౌడ్ సహకారంతో చైతన్య యూత్ ఆధ్వర్యంలో కుసంగి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థికి పదవ తరగతి తొలి మెట్టులాంటిదని, విద్యార్థులు నిర్లక్ష్యం చేయకుండా శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులతో పాటు గ్రామానికి, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. పదవ తరగతి పరీక్షలు పూర్తి అయ్యేవరకు టీవీలకు, ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి మహేష్, సీనియర్ నాయకులు రామగళ్ల అంజయ్య, పాఠశాల విద్యా కమిటీ మాజీ చైర్మన్ నారాయణ గౌడ్, మండల ఎన్ ఎస్ యు ఐ ప్రధాన కార్యదర్శి వెంకట్ గౌడ్,యూత్ కార్యవర్గ సభ్యులు అనిల్ గౌడ్, మల్లేష్ గౌడ్, ప్రసాద్ గౌడ్ అంజి గౌడ్, గజానంద్, పాండు, అభిలాష్, కృష్ణ, మురళి, ప్రసాద్ పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.


జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



నవతెలంగాణ-దుబ్బాక

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 41 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ) సూర్యప్రకాష్ చెప్పారు. ఈ నెల 15న ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు మంగళవారంతో 6 పరీక్షలు పూర్తయ్యాయని తెలిపారు. మంగళవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలో ఏర్పాటు చేసిన 3 ఇంటర్ పరీక్ష కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలకుగాను 22,622 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. వీరిలో 16,346 మంది జనరల్ గ్రూపుల విద్యార్థులు, 6276 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారని వెల్లడించారు. ప్రతిరోజూ ఫ్లైయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్నారని తెలిపారు. మంగళవారం ద్వితీయ సంవత్సరం విధ్యార్థులకు మ్యాథ్స్-ఏ, బోటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలు నిర్వహించారన్నారు. ఎస్ ఆర్, వాగ్దేవి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పరీక్షలు జరుగుతున్న తీరును, మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధునాతన సౌకర్యాల కల్పన, పరీక్షల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీనారాయణ, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు రమాదేవి, అశోక్, హుస్నా తబస్సుం, సతీష్, నాగేశ్వర్, కస్టోడియన్ శివకుమార్, ఏసిఎస్‌లు భాస్కర్ రావు, కరుణాకర్ రెడ్డి ఉన్నారు.

23న జాతీయ పంచాయితీ అవార్డుల ప్రధానం



నవ తెలంగాణ-దుబ్బాక

2021-22 ఏడాదికిగాను మండల స్థాయిలో "జాతీయ పంచాయతీ అవార్డులకు" ఎంపికైన గ్రామ పంచాయతీలకు ఈ నెల 23న అవార్డుల ప్రధానం చేయబడుతుందని దుబ్బాక మండల అభివృద్ధి అధికారి వేలేటి భాస్కర శర్మ తెలిపారు. దుబ్బాక పురపాలిక కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 23 న మధ్యాహ్నం రెండు గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. దుబ్బాక మండల పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరేష్ గౌడ్




నవతెలంగాణ-మెదక్ రూరల్

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరేష్ గౌడ్ పేర్కొన్నారు. మెదక్ పట్టణంలోని రైస్ మిల్లర్ల వసతి గృహంలో యూనియన్లకు అతీతంగా ప్రెస్ క్లబ్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా చంద్రశేఖర్ రావు, కామాటి కిషన్, వెంకటేష్ గౌడ్‌లు వ్యవహరించారు. అధ్యక్ష పదవికి దొంతి నరేష్ గౌడ్, వీరు కుమార్, ప్రధాన కార్యదర్శి పదవికి ప్రసాద్, ప్రకాష్, భువన్ కుమార్‌లు పోటీ పడ్డారు. ఎన్నికల్లో మొత్తం 78 ఓట్లు పోల్ అవగా దొంతి నరేష్ గౌడ్(సాక్షి)కి 62 ఓట్లు, వీరు కుమార్‌కు (ఆంధ్రజ్యోతి) 14 ఓట్లు రాగా రెండు ఓట్లు చెల్లలేదు. మొత్తం 48 ఓట్ల మెజార్టీతో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా నరేష్ గౌడ్ గెలుపొందారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శి పదవికి ప్రసాద్ (మహాటివి), ప్రకాష్ (టివి9), భువన్ కుమార్ (జైతెలంగాణ టివి)లు పోటీ పడగా మొత్తం 78 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో ప్రసాద్‌కు 50 ఓట్లు, ప్రకాష్‌కు 25 ఓట్లు, భువన్ కుమార్‌కు మూడు ఓట్లు వచ్చాయి. ఇందులో ప్రసాద్ 25 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మెదక్ ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా నరేష్ గౌడ్ , ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్‌లు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. వచ్చే రెండేళ్ల పాటు కొత్త కార్యవర్గం కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలు పూర్తి అయిన తరువాత మెదక్ పట్టణంలో భారీ విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించి టపాకాయలు కాల్చి, మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు.

సన్మానాల వెల్లువ

మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన దొంతి నరేష్, ప్రసాద్‌లకు జర్నలిస్టు, కుల, రాజకీయ సంఘాలు పెద్ద ఎత్తున సన్మానాలు చేశారు. మెదక్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్ కౌన్సిలర్లు జయరాజ్, అవారి శేఖర్ టిడిపి ప్రతినిధులు ఏకే.గంగాధర్ రావ్, అఫ్జల్, బొజ్జపవన్ వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ నేత వనపర్తి రోహిత్ గుప్తా, కొత్తపల్లి సొసైటీ చైర్మన్ త్యార్ల రమేష్ గుప్తా, రైస్ మిల్లర్‌లు వీరేశం, పురుషోత్తం దళిత సంఘం నాయకులు బాల్ రాజ్ ప్రతినిధులతో పాటు జర్నలిస్టులు సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు దొంతి నరేష్, ప్రసాద్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి అహర్నిశలు పాటుపడుతామని స్పష్టం చేశారు. కొంత కాలంగా అసంపూర్తిగా ఉన్న ప్రెస్ క్లబ్ భవనాన్ని ప్రజాప్రతినిధుల సహకారంతో అతిత్వరలోనే పూర్తిచేస్తామన్నారు. జర్నలిస్టుల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అన్ని సౌకర్యాలతో పూర్తి చేసే విధంగా అధికారులపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. తమపై నమ్మకంతో ఓట్లేసి గెలిపించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. జర్నలిస్ట్ నాయకులు గోపాల్ గౌడ్, సురేందర్ రెడ్డి, నరసింహ చారి, నవీన్, బివికెరాజు, వికాస్, రామకృష్ణ, సంఘమేశ్వర్, రహమత్, లక్ష్మణ్, సిద్దు, సందీప్, రాజాగౌడ్, శ్రీహరి, శేఖర్, రాజశేఖర్, నీలం, శ్రీకాంత్, రాఘవులు, ఉషయ్య, శ్రీనివాస్ చారి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలంలోని పోతారం ఎస్ గ్రామంలో మంగళవారం ఎంపీడీవో కుమారస్వామి ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఉపాధి హామీ కూలీల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఉపాధి హామీ కూలి పనులకు వచ్చే వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం పూట పనులకు వచ్చి త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎల్లయ్య పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఒకరు గైర్హాజరు

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆరవ రోజు జరిగిన ఇంటర్ పరీక్షలకు ఒకరు గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ బి.కిషన్ తెలిపారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులు 180 మందికిగాను 179 మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాన్నీ ప్రతి రోజూ ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ పరిశీలిస్తున్నారని అన్నారు. ఈ నెల 15న ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఇప్పటివరకు ఆరు పరీక్షలు పూర్తయ్యాయని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షకు గంట ముందే సెంటర్‌కు చేరుకోవాలన్నారు. హాల్ టికెట్ లేని విద్యార్థులను పరీక్షా కేంద్రానికి అనుమతించమన్నారు.